RNI TEL TEL 2024/89323.

# జన సంఘర్షణ

మా లక్ష్యం సామాన్యుని పక్షం

తెలుగు దినపత్రిక

| నిజామాబాద్ | సంపుటి : 03 | సంచిక : 134 | జూన్ 13 శనివారం 2026 | ఎడిటర్ : రాచమల్లు మాధవి | పేజీలు 08 | వెల : రూ. 6.00 |
|---|---|---|---|---|---|---|
| Nizamabad | Vol: 03 | Vol: 134 | JUN 13 Saturday 2026 | Editor : rachamallu madhavi | Pages 08 | Cost: Rs 6.00 |


ఈ నెల 25 నుంచి తెలంగాణలో ఇంటింటి ఓటర్ల సర్వే

2

# తెలంగాణాలో స్వేచ్ఛ ఉంది

## సీఎం రేవంత్ రెడ్డి చిట్



**న్యూఢిల్లీ జనసంఘర్షణ**

తెలంగాణ రాష్ట్రంలో రాజకీయాలు చేసుకునేందుకు ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి, జనసేన అధినేత పవన్ కల్యాణ్‌తో పాటు ఎవరికైనా పూర్తి స్వేచ్ఛ ఉందని ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. దేశ రాజధాని న్యూఢిల్లీ పర్యటనలో ఉన్న ఆయన, కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీతో మర్యాదపూర్వకంగా భేటీ అయిన అనంతరం మీడియాతో ఇష్టాగోష్ఠిగా మాట్లాడారు. పవన్ కల్యాణ్ తెలంగాణకు రావడానికి, ఇక్కడ పోటీ చేయడానికి ఎలాంటి అభ్యంతరాలు లేవని, అయితే గతంలో ప్రజా వ్యతిరేక వ్యాఖ్యలు చేసినందుకే తమ మంత్రులు ఆయనపై స్పందించాల్సి వచ్చిందని వివరించారు. శాంతిభద్రతల సమస్యలు తలెత్తకూడదనే ఉద్దేశంతోనే అప్పట్లో ఆయన సభకు అనుమతి నిరాకరించామని పేర్కొన్నారు. గతంలో ఏపీలో వైఎస్ జగన్ ప్రభుత్వ హయాంలో కూడా పవన్ సభలకు అనేకసార్లు అనుమతులు నిరసించిన విషయాన్ని గుర్తుచేస్తూ, దానికి గల కారణాలను పవన్ కల్యాణే చెప్పాలని రేవంత్ రెడ్డి వ్యాఖ్యానించారు. అలాగే, తనకు హిట్లర్ ఆదర్శమని తాను ఎప్పుడూ అనలేదని, ప్రజాస్వామ్యంలో ఉన్నవారెవరైనా హిట్లర్‌ను ఆదర్శంగా తీసుకుంటారా? అని ప్రశ్నించారు. అధిష్ఠానంతో జరిగిన భేటీలో మంత్రివర్గ విస్తరణపై ఎలాంటి చర్చ జరగలేదని, ప్రధాని మోదీతో భేటీ అయినప్పుడు ఆయనే తనను కౌగిలించుకున్నారని సీఎం వెల్లడించారు. కేంద్ర మంత్రి కిషన్ రెడ్డిపై సీఎం రేవంత్ రెడ్డి తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. కిషన్ రెడ్డిని పక్కా 'తెలంగాణ ద్రోహి'గా అభివర్ణించిన ఆయన, తెలంగాణ ప్రయోజనాల కోసం ఆయన కేంద్రంలో ఒక్క మంచి పని కూడా చేయలేదని మండిపడ్డారు. బీఆర్ఎస్ కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ ఢిల్లీలో స్క్రిప్ట్ రాస్తుంటే, దానికి అనుగుణంగా కిషన్ రెడ్డి ఇక్కడ

➤ మిగతా 2వ పేజిలో..

# సమ్మక్క-సారక్క బ్యారేజ్‌కు ముందడుగు

ఛత్తీస్‌గఢ్ సీఎం విష్ణుదేవ్ సాయితో మంత్రి ఉత్తమ్ భేటీ..



**వరంగల్ జనసంఘర్షణ**

అనుమతుల సాధనకు తెలంగాణ సర్కార్ చొరవ

తెలంగాణ రాష్ట్రానికి అత్యంత కీలకమైన గోదావరి నదిపై నిర్మించ తలపెట్టిన సమ్మక్క–సారక్క బ్యారేజ్ (సమ్మక్క సాగర్) ప్రాజెక్టు అనుమతుల సాధనలో రాష్ట్ర ప్రభుత్వం మరో మైలురాయిని దాటింది. హైదరాబాద్ పర్యటనకు వచ్చిన ఛత్తీస్‌గఢ్ ముఖ్యమంత్రి విష్ణు దేవ్ సాయితో రాష్ట్ర నీటిపారుదల, పౌర సరఫరాల శాఖ మంత్రి కెప్టెన్ ఎన్. ఉత్తమ్ కుమార్ రెడ్డి ప్రత్యేకంగా సమావేశమయ్యారు. ఇరు రాష్ట్రాల సరిహద్దుల్లో నిర్మిస్తున్న ఈ ప్రాజెక్టు డీపీఆర్‌ను కేంద్ర జల సంఘం (జకౌజ) తుది పరిశీలనకు తీసుకెళ్లేందుకు వీలుగా అవసరమైన అభ్యంతర రహిత పత్రం (చీూజ) జారీ చేయాలని తెలంగాణ ప్రభుత్వం తరపున మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి అధికారిక విజ్ఞాపన పత్రాన్ని ఛత్తీస్‌గఢ్ సీఎంకు సమర్పించారు. దీనిపై ఛత్తీస్‌గఢ్ ముఖ్యమంత్రి సానుకూలంగా స్పందిస్తూ, ఈ అంశాన్ని సానుభూతితో పరిశీలిస్తామని హామీ ఇవ్వడం ప్రాజెక్టు అనుమతుల ప్రక్రియలో ఒక కీలక మలుపుగా నిలిచింది. తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాటి నుండి గోదావరి జలాల

➤ మిగతా 2వ పేజిలో..

# ముడిచమురు సంక్షోభం

- డీజిల్ అమ్మకాలపై కేంద్రం ఆంక్షలు..
- ఒక్కో వాహనానికి గరిష్ఠ పరిమితి 200 లీటర్లే!



**న్యూఢిల్లీ జనసంఘర్షణ**

పశ్చిమాసియా (మిడిల్ ఈస్ట్) ప్రాంతంలో నెలకొన్న ఉద్రిక్తతల కారణంగా ముడిచమురు రవాణాకు తీవ్ర అంతరాయం ఏర్పడటంతో కేంద్ర ప్రభుత్వం అప్రమత్తమైంది. దేశీయంగా ఇంధన లభ్యతను క్రమబద్ధీకరించేందుకు పెట్రోల్ బంకుల నుంచి భారీ మొత్తంలో పెట్రోల్, డీజిల్ కొనుగోలు చేయడంపై తక్షణమే నిషేధం విధిస్తూ కీలక నిర్ణయం తీసుకుంది. రిటైల్ ఇంధన విక్రయ కేంద్రాల (పెట్రోల్ బంకులు) వద్ద ఒక్కో వాహనానికి రోజుకు గరిష్ఠంగా 200 లీటర్ల డీజిల్‌ను మాత్రమే విక్రయించాలని, అంతకుమించి సరఫరా చేయరాదని కేంద్ర పెట్రోలియం మంత్రిత్వ శాఖ దేశవ్యాప్తంగా అన్ని రిటైల్ అవుట్‌లెట్ల యాజమాన్యాలకు గట్టి ఆదేశాలు జారీ చేసింది. అత్యవసరంగా అమలుల్లోకి వచ్చిన ఈ కఠిన నిబంధనలు ప్రాథమికంగా 90 రోజుల పాటు వర్తిస్తాయని, ఆ తర్వాత అంతర్జాతీయ పరిస్థితులను బట్టి గడువు పొడిగింపుపై నిర్ణయం తీసుకుంటామని ప్రభుత్వం స్పష్టం చేసింది. సాధారణంగా పారిశ్రామిక, వాణిజ్య అవసరాల కోసం భారీ మొత్తంలో కొనుగోలు చేసే 'బల్క్' ఇంధన ధరలకు, సాధారణ పెట్రోల్ బంకుల్లో లభించే 'రిటైల్' ధరలకు మధ్య పెద్ద వ్యత్యాసం ఉంటుంది. ప్రస్తుతం బంకుల్లో లీటర్ డీజిల్ ధర సుమారు రూ. 95.20 ఉండగా, బల్క్ మార్కెట్‌లో అది ఏకంగా రూ. 134.50 పలుకుతోంది. ఈ భారీ ధరల వ్యత్యాసాన్ని ఆసరాగా చేసుకుని కొన్ని పరిశ్రమల నిర్వాహకులు, వాణిజ్య వినియోగదారులు బల్క్ సప్లయర్స్ నుంచి కాకుండా, నేరుగా సాధారణ రిటైల్ బంకుల నుంచి భారీ

➤ మిగతా 2వ పేజిలో..

# పాశ్చాత్య దేశాలది ద్వంద్వ నీతి

ఎండగట్టిన జైశంకర్: రష్యా చమురు కొనుగోళ్లపై భారత్ స్పష్టత



**న్యూఢిల్లీ జనసంఘర్షణ**

అంతర్జాతీయ వేదికలపై పాశ్చాత్య దేశాలు అవలంబిస్తున్న ద్వంద్వ ప్రమాణాలను భారత విదేశాంగ మంత్రి ఎస్. జైశంకర్ మరోసారి తీవ్రస్థాయిలో ఎండగట్టారు. రష్యాతో భారత్ జరుపుతున్న ముడి చమురు వ్యాపారాన్ని తప్పుబడుతున్న అమెరికా, ఐరోపా దేశాల తీరును ఆయన ఆక్షేపించారు. ఫిన్లాండ్‌లో జరిగిన ఒక అంతర్జాతీయ కార్యక్రమంలో రష్యా–భారత్ సంబంధాలపై ఒక విలేకరి అడిగిన ప్రశ్నకు మంత్రి జైశంకర్ అత్యంత సూటిగా, ధీటుగా సమాధానమిచ్చారు. అంతర్జాతీయ ఇంధన మార్కెట్‌లో ధరల స్థిరీకరణ కోసం, చమురు

➤ మిగతా 2వ పేజిలో..

# పెద్దల సభకు ఏకగ్రీవ సమరం

- ముందే ఎన్నికైన 24 మంది సభ్యులు..
- విజేతల్లో ఖర్గే, తరుణ్ చుగ్

**న్యూఢిల్లీ జనసంఘర్షణ**

పార్లమెంట్ ఎగువ సభ అయిన రాజ్యసభకు ఈనెల 18న జరగాల్సిన ఎన్నికల కంటే ముందే ఒక కీలక పరిణామం చోటుచేసుకుంది. దేశవ్యాప్తంగా ఖాళీగా ఉన్న మొత్తం 27 రాజ్యసభ స్థానాలకు గాను 24 స్థానాల్లో అభ్యర్థులు పోటీ లేకుండా ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఏకగ్రీవంగా ఎన్నికైన వారిలో కాంగ్రెస్ జాతీయ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గే, బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి తరుణ్ చుగ్ వంటి ప్రముఖ శీర్షాలు ఉన్నారు. నామినేషన్ల ఉపసంహరణ గడువు ముగియడంతో మిగిలిన అభ్యర్థులెవరూ బరిలో లేకపోవడంతో, ఆయా రాష్ట్రాల రిటర్నింగ్ అధికారులు విజేతలకు అధికారికంగా విన్నింగ్ సర్టిఫికేట్లను అందజేశారు. ఈ తాజా ఎన్నికల ఫలితాలతో రాజ్యసభలో ప్రధాన పక్షాల

➤ మిగతా 2వ పేజిలో..

# హెచ్-1బీ వీసా రుసుము పెంపు

**బోస్టన్ కోర్టు తీర్పుపై అప్పీలుకు ట్రంప్ సర్కార్ సిద్ధం**

**న్యూఢిల్లీ గరుడ ధాత్రి**

అమెరికా హెచ్–1బీ వీసా ఫీజు పెంపు వ్యవహారంలో అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ నేతృత్వంలోని ప్రభుత్వం పట్టుదలతో ముందడుగు వేస్తోంది. వీసా రుసుమును ఏకంగా లక్ష డాలర్లకు పెంచుతూ గతేడాది సెప్టెంబరులో ట్రంప్ యంత్రాంగం తీసుకున్న వివాదాస్పద నిర్ణయాన్ని ఇటీవల బోస్టన్‌లోని ఫెడరల్ న్యాయస్థానం తోసిపుచ్చిన సంగతి తెలిసిందే. ఈ నిర్ణయం చట్టవిరుద్ధమంటూ కోర్టు ఇచ్చిన తీర్పును సవాల్ చేస్తూ ఉన్నత న్యాయస్థానాన్ని ఆశ్రయించేందుకు అమెరికా న్యాయశాఖ (డిపార్ట్‌మెంట్ ఆఫ్ జస్టిస్) చట్టపరమైన చర్యలు ప్రారంభించింది. ఇందులో భాగంగా కోర్టు తీర్పుపై అప్పీలు చేసుకునేందుకు అనుమతించాలని కోరుతూ న్యాయశాఖ అధికారికంగా నోటీసు దాఖలు చేసింది. గతంలో ట్రంప్ సర్కార్ ప్రకటించిన ఈ

➤ మిగతా 2వ పేజిలో..

# తెలంగాణాలో స్వేచ్ఛ ఉంది

**మొదటిపేజీ తరువాయి..** డ్రామాలు ఆడుతున్నారని విమర్శించారు. తెలంగాణకు రావాల్సిన పలు ప్రాజెక్టులు, నిధులు నిలిచిపోవడానికి కిషన్ రెడ్డే ప్రధాన కారణమని, చివరికి రీజినల్ రింగ్ రోడ్డు పనులను కూడా ఆయనే అడ్డుకుంటున్నారని ఆరోపించారు. తుమ్మిడిహెట్టి ప్రాజెక్టు విషయమై మహారాష్ట్ర ప్రభుత్వంతో మాట్లాడేందుకు కిషన్ రెడ్డికి ఎందుకు చొరవ లేదని నిలదీశారు. గతంలో పోలవరం ప్రాజెక్టు కోసం తెలంగాణలోని 5 మండలాలను ఏపీలో కలిపినప్పుడు లేని అభ్యంతరం, తెలంగాణ ప్రయోజనాల కోసం మహారాష్ట్ర నుండి 1500 ఎకరాలు సాధించడంలో ఎందుకు చూపడం లేదన్నారు. మహారాష్ట్రను ఒప్పించే వరకు కేబినెట్ సమావేశానికి వెళ్లనని కిషన్ రెడ్డి, అవసరమైతే రాజీనామా చేస్తామని బీజేపీకి చెందిన 8 మంది ఎంపీలు ఒత్తిడి తెస్తే రాష్ట్రానికి నిధులు ఎందుకు రావని ప్రశ్నించారు. కిషన్ రెడ్డి తెలంగాణకు అనుకూలంగా మాట్లాడినట్లు ఒక్క సందర్భాన్ని అయినా నిరూపించగలరా అని సవాల్ విసిరారు. బీజేపీ వైఖరిపై రేవంత్ రెడ్డి వ్యంగ్యాస్త్రాలు సంధిస్తూ, ఆ పార్టీ కేవలం 'ఓట్ల చోరీ', 'సీట్ల చోరీ' రాజకీయాలకే పరిమితమైందని ఎద్దేవా చేశారు. గాడ్సేనే కాకుండా ఉత్తర కొరియా అధ్యక్షుడు కిమ్ జోంగ్ ఉన్‌ను కూడా బీజేపీ ఆదర్శంగా తీసుకుందని దుయ్యబట్టారు. ఉత్తర కొరియాలో ఎన్నికలు జరిగినా ఫలితాలు మాత్రం కిమ్ అనుకున్నట్లే వస్తాయని, ప్రస్తుతం దేశంలోనూ రిటర్నింగ్ అధికారులు బీజేపీ కార్యకర్తల్లా మారి అదే తరహా పాలన సాగిస్తున్నారని ఆరోపించారు. తెలంగాణ కాంగ్రెస్ వ్యవహారాల ఇన్‌ఛార్జ్ మీనాక్షి నటరాజన్ రాజ్యసభ నామినేషన్‌ను అప్రజాస్వామికంగా తిరస్కరించడం అత్యంత బాధాకరమని, ఆమెపై ఎలాంటి కేసులు లేకపోయినా నామినేషన్ తిరస్కరించడం బీజేపీ మహిళా వ్యతిరేక విధానానికి అద్దం పడుతోందన్నారు. మధ్యప్రదేశ్‌లో తగిన సంఖ్యాబలం లేకపోయినా మూడో అభ్యర్థిని బరిలోకి దించడమే బీజేపీ దుర్బుద్ధికి నిదర్శనమన్నారు. కేంద్రం తెలంగాణ పట్ల చూపుతున్న వివక్షను, బీజేపీ చేస్తున్న కుట్ర రాజకీయాలను తాము గట్టిగా ఎదుర్కొంటామని సీఎం రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు.

# పాశ్చాత్య దేశాలది ద్వంద్వ నీతి

**మొదటిపేజీ తరువాయి..** కొరత ఏర్పడకుండా చూసేందుకు రష్యా నుంచి క్రూడాయిల్ కొనుగోలు చేయాలంటూ 2022లో స్వయంగా అమెరికాయే భారత్‌ను కోరిన ఉదంతాన్ని ఈ సందర్భంగా ఆయన గుర్తుచేశారు. ఈ నేపథ్యంలో అమెరికా తీసుకునే నిర్ణయాలకు లేదా విధించే సుంకాలకు ఎలాంటి నైతిక ప్రాధాన్యతను ఆపాదించాల్సిన అవసరం లేదని, అవన్నీ వారి సొంత ప్రయోజనాల కోసమేనని స్పష్టం చేశారు. మొదట రష్యా చమురుపై ఆంక్షలు విధించి, ఆ తర్వాత మార్కెట్ అవసరాల కోసం వాటిని సడలించడంలో ఎలాంటి సిద్ధాంతాలు లేవని, ఇదంతా కేవలం వారి వాణిజ్య అవసరాల కోసమేనని తేల్చిచెప్పారు.

ఉక్రెయిన్ సంక్షోభం తర్వాత రష్యా పట్ల భారత్ ఉదారంగా వ్యవహరిస్తోందన్న ఆరోపణలను తిప్పికొడుతూ.. ఇంధన కొనుగోళ్లు పూర్తిగా దేశ ఆర్థిక ప్రయోజనాలు, మార్కెట్ లభ్యత, ధరల ఆధారంగానే జరుగుతున్నాయని మంత్రి వివరించారు. అప్పట్లో భారత్‌కు సాంప్రదాయకంగా ఇంధనాన్ని సరఫరా చేసే పశ్చిమాసియా (మిడిల్ ఈస్ట్) దేశాల నుంచి ఐరోపా దేశాలు పెద్ద ఎత్తున చమురును కొనుగోలు చేయడం ప్రారంభించాయని, ఆ పరిస్థితుల్లో భారతదేశ ఇంధన భద్రత కోసం తాము రష్యా వైపు మొగ్గుచూపాల్సి వచ్చిందని సమర్థించుకున్నారు. రష్యా తమకు ఎప్పటి నుంచో నమ్మకమైన సరఫరాదారుగా ఉందని పేర్కొన్నారు.

ఇదే సమయంలో ఐరోపా దేశాల పక్షపాత వైఖరిపై ఆయన ప్రతీకార విమర్శలు చేశారు. రష్యా నుంచి చమురు కొనడంపై భారత్‌ను ప్రశ్నిస్తున్న ఐరోపా దేశాలు, గతంలో భారతదేశ శత్రుదేశాలకు యథేచ్ఛగా ఆయుధాలు విక్రయించిన విషయాన్ని మర్చిపోకూడదని హెచ్చరించారు. ఐరోపా దేశాలు అమ్మిన ఆయుధాలను శత్రువులు భారతదేశంపై దాడులు చేయడానికి ఉపయోగించారని, ఈ పరిస్థితి కొన్నేళ్లుగా సాగుతోందని గుర్తుచేశారు. భారత్ తయారు చేసిన ఏ ఆయుధం కూడా ఐరోపాకు ముప్పుగా మారలేదని, భారతీయులు ఎప్పుడూ ఐరోపాను ప్రమాదంలోకి నెట్టలేదని వ్యాఖ్యానించారు. ఆంక్షలు, అంతర్జాతీయ వాణిజ్యం విషయంలో పాశ్చాత్య దేశాల తీరు పరస్పర విరుద్ధంగా ఉందని తప్పుబడుతూ.. భారతదేశం ఎప్పుడైనా తన సొంత జాతీయ ప్రయోజనాలు, ప్రజల ఇంధన భద్రతను దృష్టిలో ఉంచుకునే స్వతంత్ర నిర్ణయాలు తీసుకుంటుందని జైశంకర్ ఖరాఖండిగా తేల్చిచెప్పారు.

## స్కూలు డ్రెస్సుల కుంభకోణం

**వివరాలు వెల్లడించాల్సిన బాధ్యత ప్రభుత్వానిదే**

**హైదరాబాద్, :** స్కూల్ డ్రెస్సులను కూడా మహిళా సంఘాలకు అప్పగిస్తామని గతంలో సిఎం ప్రకటించినట్లు సమాచారం. వారికి ఈ పని అప్పగిస్తే మరింత మంచి ఫలితం వస్తుందని చాలామంది అభిప్రాయపడుతున్నారు. అయితే ఈ కాంట్రాక్టును గుజరాత్ కంపెనీకి అప్పగించారని విపక్ష నేత హరీష్ రావు చేసిన ఆరోపణలపై నిజాలు వెలుగు చూడాల్సి ఉంది. గుజరాత్ కాంట్రాక్టర్ల పేరుతో విద్యాశాఖలో రూ.2000 కోట్ల భారీ కుంభకోణం జరిగిందని మాజీ మంత్రి హరీశ్ రావు ఆరోపించారు. కాంట్రాక్టులు, కమీషన్ల కోసమే పాఠశాలల పునఃప్రారంభం వాయిదా వేశారని అన్నారు. బీఆర్ఎస్ హయాంలో గురుకులాలు, ప్రభుత్వ పాఠశాలల్లో యూనిఫామ్స్ కుట్టే బాధ్యత చేనేత కార్మికులకు, షూ, బెల్టుల తయారీ దళిత కుటుంబాలు బతకాలని లిడ్ క్యాప్‌కు ఇచ్చామన్నారు. సీఎం రేవంత్ రెడ్డి మాత్రం వాటిని సెంట్రలైజ్ చేసి.. గుజరాత్ కాంట్రాక్టర్‌కు అప్పగించారని మండిపడ్డారు. ఆ గుజరాత్ కాంట్రాక్టర్ నుంచి ఇంతవరకు బట్టలు రాలేదని, 7 లక్షల మంది గురుకుల విద్యార్థులకు ఇవ్వాల్సిన బ్యాగులు, డ్రెస్సులు, బెల్టులు, పుస్తకాలు ఏవీ అందలేదన్నారు.

# సమ్మక్క-సారక్క బ్యారేజ్‌కు ముందడుగు

**మొదటిపేజీ తరువాయి..** అత్యున్నత ప్రాధాన్యత ఇస్తోందని ఈ సందర్భంగా మంత్రి తెలిపారు. సమ్మక్క-సారక్క ప్రాజెక్టుకు కేంద్ర జల సంఘంలోని అంతర్రాష్ట్ర వ్యవహారాల డైరెక్టరేట్ మినహా హైడ్రాలజీ, కాస్ట్ ఎస్టిమేట్స్, గిరిజన వ్యవహారాల మంత్రిత్వ శాఖ, కేంద్ర భూగర్భ జల మండలి వంటి మిగతా అన్ని విభాగాల నుండి ఇప్పటికే అనుమతులు లభించాయి. ఛత్తీస్‌గఢ్ ప్రభుత్వ ఎన్ఓసీ లేకపోవడం వల్లనే డీపీఆర్ తుది పరిశీలన నిలిచిపోయిన విషయాన్ని మంత్రి ఉత్తమ్ ఛత్తీస్‌గఢ్ సీఎం దృష్టికి తీసుకెళ్లారు. ప్రాజెక్టు ముంపు, బ్యాక్‌వాటర్ ప్రభావాలపై ఇరు రాష్ట్రాల ఇంజినీర్లు సంయుక్త సర్వే నిర్వహిస్తున్నారని, మరింత ఖచ్చితమైన సమాచారం కోసం ఛత్తీస్‌గఢ్ ప్రభుత్వం కోరడంతో తెలంగాణ ప్రభుత్వం పూర్తి సహకారం అందించిందని వివరించారు. ఈ సర్వే ఖర్చుల నిమిత్తం రూ. 9.883 కోట్లను తెలంగాణ ప్రభుత్వం విడుదల చేయగా, ప్రస్తుతం బీజాపూర్ జిల్లాలో సర్వే పనులు శరవేగంగా సాగుతున్నాయి. ఒకవేళ ముంపు ప్రభావిత భూములు గుర్తిస్తే చట్టబద్ధంగా పరిహారం చెల్లించడానికి, అవసరమైతే ఆ మొత్తాన్ని ముందుగానే డిపాజిట్ చేయడానికి కూడా తెలంగాణ సిద్ధంగా ఉందని స్పష్టం చేశారు.

ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ హయాంలో ప్రతిపాదించిన పీవీ నరసింహారావు కంతనపల్లి సుజల స్రవంతి పథకమే రూపాంతరం చెంది నేటి సమ్మక్క-సారక్క ప్రాజెక్టుగా మారింది. గతంలో కంతనపల్లి వద్ద బ్యారేజ్ నిర్మించాలని భావించినప్పటికీ, తెలంగాణ ఏర్పాటు తర్వాత జరిగిన సాంకేతిక అధ్యయనాల ఆధారంగా ములుగు జిల్లా తుపాకులగూడెం వద్దకు మార్చారు. ఈ రీ-డిజైనింగ్ వల్ల ఛత్తీస్‌గఢ్ రాష్ట్రంలో ముంపు ప్రభావం గణనీయంగా తగ్గిందని మంత్రి వివరించారు. ఈ బ్యారేజ్ ద్వారా గోదావరి నుండి 46.96 టీఎంసీల నీటిని మళ్లించి ఎస్సారెస్పీ స్టేజ్-2 కింద సూర్యాపేట, మహబూబాబాద్, ఖమ్మం, వరంగల్, జనగామ జిల్లాల్లోని దాదాపు 4.40 లక్షల ఎకరాల ఆయకట్టును స్థిరీకరించనున్నారు. దీనికి అదనంగా నిర్మించే రామప్ప-పాకాల లింక్ కాలువ ద్వారా ములుగు, నర్సంపేట ప్రాంతాల్లో మరో 30 వేల ఎకరాలకు కొత్తగా సాగునీరు అందుతుంది. అలాగే దేవాదుల ఎత్తిపోతల పథకంలోని కొంత ఆయకట్టు స్థిరీకరణతో పాటు ఉమ్మడి వరంగల్, ఖమ్మం జిల్లాల్లోని వందలాది గ్రామాలకు తాగునీటి ప్రయోజనం చేకూరుతుంది.

ఈ ప్రాజెక్టుకు అనుమతులు త్వరితగతిన సాధించేందుకు తెలంగాణ ప్రభుత్వం గత రెండేళ్లుగా నిరంతరాయంగా శ్రమిస్తోంది. పలుమార్లు ఛత్తీస్‌గఢ్ ప్రభుత్వానికి లేఖలు రాయడంతో పాటు గతంలో రాయ్‌పూర్‌లో సీఎం విష్ణు దేవ్ సాయిని మంత్రి ఉత్తమ్ వ్యక్తిగతంగా కలిసి మాట్లాడారు. అలాగే కేంద్ర జలశక్తి మంత్రి సి.ఆర్. పాటిల్, కేంద్ర జల సంఘం చైర్మన్‌లతో కూడా సంప్రదింపులు జరిపారు. ప్రస్తుత సర్వే పనులు ముగింపు దశకు రావడం, నిధుల విడుదల, పరిహారానికి తెలంగాణ అంగీకరించడం వంటి పరిణామాలతో త్వరలోనే ఎన్ఓసీ లభిస్తుందని మంత్రి ఉత్తమ్ ఆశాభావం వ్యక్తం చేశారు. పొరుగు రాష్ట్రంతో నెలకొన్న సత్సంబంధాలు, రైతుల ప్రయోజనాలే పరమావధిగా సమ్మక్క-సారక్క ప్రాజెక్టును త్వరలోనే సాకారం చేస్తామని ఆయన ధీమా వ్యక్తం చేశారు.

## ఈ నెల 25 నుంచి తెలంగాణలో ఇంటింటి ఓటర్ల సర్వే

**రాజకీయ పార్టీలన్నీ సహకరించాలని ఈసీ సుదర్శన్ రెడ్డి పిలుపు**

తెలంగాణ రాష్ట్రంలో ఈ నెల 25 నుంచి ప్రారంభం కానున్న ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ సర్వే కార్యక్రమానికి అన్ని రాజకీయ పార్టీలు పూర్తి సహాయ సహకారాలు అందించాలని రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి (సిఇఒ) సి. సుదర్శన్ రెడ్డి విజ్ఞప్తి చేశారు. హైదరాబాద్‌లోని బీఆర్‌కే భవన్‌లో ఉన్న సీఈఓ కార్యాలయంలో ప్రత్యేక సమగ్ర సవరణ ప్రక్రియపై గుర్తింపు పొందిన అన్ని రాజకీయ పార్టీల ప్రతినిధులతో ఆయన ఉన్నత స్థాయి సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అర్హులైన ప్రతి పౌరుడికి ఓటరు జాబితాలో స్థానం కల్పించడం, మరణించిన వారి పేర్లు మరియు నకిలీ ఓట్లను తొలగించి అత్యంత పారదర్శకమైన, స్వచ్ఛమైన ఓటరు జాబితాను సిద్ధం చేయడమే భారత ఎన్నికల సంఘం ముఖ్య ఉద్దేశమని స్పష్టం చేశారు. ఈ ప్రతిష్టాత్మక ప్రక్రియ రాష్ట్రంలో ఎలాంటి అడ్డంకులు లేకుండా సజావుగా సాగేందుకు అన్ని పార్టీల నేతలు బాధ్యతాయుతంగా వ్యవహరించాలని కోరారు. ఈ సమగ్ర సవరణ ప్రక్రియలో భాగంగా ఈనెల 25 నుంచి వచ్చే నెల జూలై 24 వరకు నెల రోజుల పాటు బూత్ స్థాయి అధికారులు (బీఎల్ఓ) విస్తృతంగా ఇంటింటి సర్వే నిర్వహించనున్నారని సుదర్శన్ రెడ్డి వెల్లడించారు. క్షేత్రస్థాయిలో సర్వేకు వచ్చే బీఎల్వోలు తమ పరిధిలోని ప్రతి ఇంటికి వెళ్లి 'ఎన్యుమరేషన్ ఫారాలను' అందిస్తారని, ఆ ఫారాలను సరైన వివరాలతో భర్తీ చేసేలా ప్రజలకు అవగాహన కల్పించడంలో రాజకీయ పార్టీలు కీలక పాత్ర పోషించాలన్నారు. ఇందుకోసం రాజకీయ పార్టీలు తమ తరఫున నియమించుకున్న బూత్ స్థాయి ఏజెంట్లకు (బీఎల్ఏ) ఈ ప్రక్రియపై ముందే పూర్తి అవగాహన కల్పించాలని సూచించారు.

# ముడిచమురు సంక్షోభం

**మొదటిపేజీ తరువాయి..** మొత్తంలో ఇంధనాన్ని తరలిస్తున్నారు. దీనివల్ల ఇటీవల కాలంలో పలు ప్రాంతాల్లోని పెట్రోల్ బంకుల్లో ఇంధన విక్రయాలు అసాధారణంగా పెరిగిపోయి, సాధారణ వాహనదారులకు తీవ్ర కొరత ఏర్పడే పరిస్థితి తలెత్తింది.

ఈ అక్రమ తరలింపును, కృత్రిమ కొరతను అరికట్టేందుకే కేంద్ర ప్రభుత్వం రంగంలోకి దిగింది. పారిశ్రామిక అవసరాల కోసం రిటైల్ బంకులను ఆశ్రయించడాన్ని పూర్తిగా నిషేధించడంతో పాటు, వారు కచ్చితంగా బల్క్ సప్లై చైన్ల ద్వారానే ఇంధనాన్ని సేకరించాలని తేల్చిచెప్పింది. అలాగే బంకుల్లో కొనుగోలు చేసిన డీజిల్‌ను మళ్లీ ఇతరులకు పునర్విక్రయం (రీసేల్) చేయడాన్ని చట్టవిరుద్ధంగా ప్రకటించింది. కేంద్రం తీసుకున్న ఈ తాజా చర్యల వల్ల ఇంధన వృధా అరికట్టబడటమే కాకుండా, సాధారణ వినియోగదారులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా పెట్రోల్, డీజిల్ సరఫరా సజావుగా సాగుతుందని అధికారులు భావిస్తున్నారు.

## హెచ్-1బీ వీసా రుసుము పెంపు

**మొదటిపేజీ తరువాయి..** భారీ ఫీజు పెంపు ప్రపంచవ్యాప్తంగా ఐటీ రంగాన్ని తీవ్ర దిగ్భ్రాంతికి గురిచేసింది. దీనిపై యూఎస్ ఛాంబర్ ఆఫ్ కామర్స్‌తో పాటు డెమోక్రాట్ పాలిత రాష్ట్రాలు తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేస్తూ న్యాయపోరాటానికి దిగాయి. ఈ క్రమంలోనే బోస్టన్ కోర్టు ఇచ్చిన తీర్పుతో విదేశీ ఉద్యోగులను నియమించుకునే పలు అంతర్జాతీయ కంపెనీలకు పెద్ద ఊరట లభించినట్లయింది. అయితే, తాజాగా ట్రంప్ ప్రభుత్వం ఈ తీర్పుపై పైకోర్టుకు వెళ్లేందుకు సిద్ధమవడంతో ఈ వివాదం మరికొన్ని నెలల పాటు న్యాయస్థానాల్లోనే నలిగే అవకాశం కనిపిస్తోంది. ఫలితంగా వీసా ఫీజుల భారం నుంచి కంపెనీలకు లభించిన ఉపశమనం తాత్కాలికమేనా అనే ఆందోళన మళ్లీ మొదలైంది.

# పెద్దల సభకు ఏకగ్రీవ సమరం

**మొదటిపేజీ తరువాయి..** సంఖ్యాబలంలో స్వల్ప మార్పులు చోటుచేసుకున్నాయి. ఎన్డీయే కూటమి తన స్థానాలను మరింత పదిలం చేసుకోగా, కాంగ్రెస్ పార్టీకి ఒక స్థానం అదనంగా పెరిగింది. రాష్ట్రాల వారీగా జరిగిన ఈ ఎన్నికల ఫలితాలను గమనిస్తే.. ఆంధ్రప్రదేశ్‌లో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ (వైఎస్సార్సీపీ) ఈసారి మూడు రాజ్యసభ స్థానాలను కోల్పోగా, అక్కడ అధికారంలో ఉన్న ఎన్డీయే కూటమి మొత్తం నాలుగు స్థానాలనూ సొంతం చేసుకుంది. అలాగే గుజరాత్‌లోని నాలుగు స్థానాలను కూడా ఎన్డీయే పరం చేసుకుంది. ఒడిశాలో మాజీ ముఖ్యమంత్రి నవీన్ పట్నాయక్ సారథ్యంలోని బిజూ జనతాదళ్ (బీజేడీ) సైతం తన స్థానాన్ని కోల్పోవాల్సి వచ్చింది. ఇటీవల మే 26న బీజేడీకి రాజీనామా చేసి బీజేపీలో చేరిన దేబాశిష్ సమంతరాయ్, ఇప్పుడు బీజేపీ అభ్యర్థిగా ఒడిశా నుంచి ఏకగ్రీవంగా ఎన్నిక కావడం గమనార్హం. మరోవైపు కర్ణాటకలో కాంగ్రెస్ పార్టీ తన పట్టును నిలుపుకుంటూ 3 స్థానాలను గెలుచుకోగా, బీజేపీ ఒక స్థానాన్ని దక్కించుకుంది.

మధ్యప్రదేశ్‌లో ఖాళీగా ఉన్న మొత్తం 3 స్థానాలనూ బీజేపీ క్లీన్‌స్వీప్ చేయగా, రాజస్థాన్‌లోని 3 స్థానాల్లో రెండింటిని బీజేపీ, ఒక స్థానాన్ని కాంగ్రెస్ గెలుచుకున్నాయి. ఈశాన్య రాష్ట్రాలైన అరుణాచల్ ప్రదేశ్, మణిపూర్‌లలోని ఒక్కో స్థానాన్ని బీజేపీ దక్కించుకోగా, మేఘాలయలో ఎన్డీయే భాగస్వామ్య పక్షమైన ఎన్‌పీపీ (ఎన్పీపీ) అక్కడి ఏకైక స్థానాన్ని కైవసం చేసుకుంది. మహారాష్ట్ర ఉప ఎన్నికలోనూ ఎన్డీయే అభ్యర్థి ఏకగ్రీవమవ్వగా, తమిళనాడులోని ఏకైక స్థానాన్ని కాంగ్రెస్ పార్టీ దక్కించుకుంది. మొత్తం మీద 24 స్థానాల ఫలితాలు ఏకగ్రీవంగా తేలిపోవడంతో, ఇప్పుడు అందరి దృష్టి మిగిలిన స్థానాలపైనే నెలకొంది.

## ఆర్ఎస్ఎస్ చీఫ్ ప్రయాణిస్తున్న రైలుపై రాళ్లు

**ఇద్దరు నిందితులను అరెస్ట్ చేసిన పోలీసులు**

**న్యూఢిల్లీ, జూన్12 :** రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్ ఆర్ఎస్ఎస్ అధినేత మోహన్ భాగవత్ ప్రయాణిస్తున్న రైలుపై రాళ్ల దాడి జరిగింది. ఈ దాడికి సంబంధించి ఇద్దరు నిందితులను పోలీసులు అరెస్టు చేశారు. గురువారం రాత్రి మోహన్ భాగవత్ కాన్పూర్ నుంచి దిల్లీకి వెళ్తున్న శతాబ్ది ఎక్స్‌ప్రెస్ రైలులో ప్రయాణించారు. ఉత్తర్‌ప్రదేశ్‌లోని ఫిరోజాబాద్ రైల్వేస్టేషన్ సమీపంలో కొందరు గుర్తుతెలియని వ్యక్తులు ఈ రైలుపై రాళ్లు విసిరారు. దీంతో ఏసీ ఫస్ట్ క్లాస్ కోచ్‌లోని ఓ కిటికీ దెబ్బతింది. భాగవత్ కూడా ఇదే కోచ్‌లో ఉన్నారు. సమాచారం అందుకున్న వెంటనే పోలీసులు ఘటనా స్థలానికి చేరుకున్నారు. ఈ ఘటనలో ఆయనకు ఎలాంటి గాయాలు కాలేదని పోలీసులు ధ్రువీకరించారు. ఫిర్యాదు ఆధారంగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. ఈ క్రమంలోనే సీసీటీవీ దృశ్యాలను పరిశీలించగా ముగ్గురు వ్యక్తులు కావాలనే రాళ్ల దాడికి పాల్పడినట్లు యూపీ పోలీసులు గుర్తించారు. ఆ ముగ్గురిలో ఇద్దరిని అరెస్టు చేసినట్లు తాజాగా పేర్కొన్నారు. మరో వ్యక్తి కోసం గాలింపు చర్యలు చేపట్టినట్లు వెల్లడించారు.

# 12 ఏళ్ల బాలికపై అమానుష ఘటన

- తీవ్రంగా ఖండించిన ఇల్లందు జనసేన నాయకులు
- బాధిత చిన్నారి కుటుంబానికి న్యాయం చేయాలి: ఇల్లందు జనసేన ఇన్‌ఛార్జ్ ఆంగోత్ శ్రీను, నాయకులు
- నిందితుడిని కఠినంగా శిక్షించాలని డిమాండ్!

ఇల్లందు జూన్ 11 (జన సంఘర్షణ)

ఖమ్మం నగరంలో 12 ఏళ్ల మైనర్ బాలికపై జరిగిన అమానుష ఘటనపై తీవ్ర దిగ్భ్రాంతి, నిరసన వ్యక్తమవుతోంది. ఈ క్రమంలోనే ఇల్లందు నియోజకవర్గ జనసేన పార్టీ నాయకులు, జనసైనికులు ఈ దారుణాన్ని తీవ్రంగా ఖండించారు. సమాజం తలదించుకునేలా ఉన్న ఇటువంటి ఘాతుకాలపై జనసేన శ్రేణులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశాయి. జనసేన నాయకులు మద్ది సాయికుమార్ మీడియా ముందుకు వచ్చి ఈ ఘోరకలిని తీవ్ర పదజాలంతో తప్పుపట్టారు. చిన్నారి జీవితాన్ని అంధకారంలోకి నెట్టి, చంద్రమయ్యేలా చేసిన ఇటువంటి క్రూరమైన చర్యలకు నాగరిక సమాజంలో ఏమాత్రం స్థానం లేదని ఆయన స్పష్టం చేశారు. ఇలాంటి సంఘటనలు మహిళల, బాలికల భద్రతను ప్రశ్నార్థకం చేస్తున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. బాధిత బాలికకు తక్షణమే ప్రభుత్వం తరఫున అత్యుత్తమ మరియు మెరుగైన వైద్య చికిత్స అందించాలని జనసేన నాయకులు డిమాండ్ చేశారు.



భయాందోళనల్లో ఉన్న ఆ చిన్నారి కుటుంబానికి ప్రభుత్వం పూర్తి స్థాయి భద్రత కల్పించాల్సిన అవసరం ఎంతైనా ఉందని వారు పేర్కొన్నారు. ఆ కుటుంబానికి అన్ని విధాలా న్యాయం జరిగే వరకు తాము అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. ఈ అమానుష ఘటనకు పాల్పడిన నిందితుడిని చట్టం ముందు నిలబెట్టి, అత్యంత కఠినంగా శిక్షించాలని వారు ప్రభుత్వాన్ని, పోలీసు యంత్రాంగాన్ని గట్టిగా డిమాండ్ చేశారు. ఇటువంటి క్రిమినల్స్‌లో భయం పుట్టేలా కఠిన చర్యలు తీసుకుంటేనే భవిష్యత్తులో ఇలాంటి దారుణాలు పునరావృతం కాకుండా ఉంటాయని జనసేన శ్రేణులు అభిప్రాయపడ్డాయి. ఈ నిరసన, ఖండన కార్యక్రమంలో ఇల్లందు నియోజకవర్గ జనసేన పార్టీ ముఖ్య నాయకులు, పదాధికారులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. నియోజకవర్గ ఇన్చార్జ్ ఆంగోత్ శ్రీను నేతృత్వంలో పార్టీ శ్రేణులు ఈ అన్యాయంపై గళం విప్పారు. ఈ కార్యక్రమంలో జనసేన ప్రముఖ నాయకులు మద్ది సాయికుమార్, ముత్యాల వీరబ్రహ్మం, ఆవుతుర్తి శ్రావణ్, మధు యాదవ్, కాయం శాంతి కుమార్, హేమంత్, మరియు బానోత్ గోపీనాథ్‌లతో పాటు పలువురు జనసైనికులు పాల్గొని బాధిత కుటుంబానికి తమ సంఘీభావాన్ని ప్రకటించారు.

# రైతులు అంతర, ఆరుతడి పంటలపై దృష్టి సారించాలి

- ఇల్లందు మార్కెట్ కమిటీ చైర్మన్ బానోత్ రాంబాబు
- ఎమ్మెల్యే కోరం కనకయ్య ఆదేశాలతో ఇల్లందు సొసైటీ ఆధ్వర్యంలో పచ్చిరొట్ట విత్తనాల పంపిణీ

ఇల్లందు జూన్ 11 (జన సంఘర్షణ)

వ్యవసాయ సీజన్ ప్రారంభమైన నేపథ్యంలో రైతులందరూ సాంప్రదాయ పంటలకే పరిమితం కాకుండా, లాభదాయకమైన అంతర పంటలపై దృష్టి సారించాలని ఇల్లందు మార్కెట్ కమిటీ చైర్మన్ బానోత్ రాంబాబు పిలుపునిచ్చారు. ఇల్లందు నియోజకవర్గ శాసనసభ్యులు కోరం కనకయ్య ఆదేశాల మేరకు, ఇల్లందు ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘం అధ్యక్షులు మెట్ల కృష్ణ ఆధ్వర్యంలో ఖరీఫ్ సీజన్ పచ్చిరొట్ట విత్తనాల పంపిణీ కార్యక్రమం ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమానికి చైర్మన్ రాంబాబు సహచర ప్రజాప్రతినిధులతో కలిసి హాజరై, రైతులకు విత్తనాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా చైర్మన్ రాంబాబు మాట్లాడుతూ.. ప్రతి ఏటా ఒకే రకమైన పంటలు వేసి నష్టపోకుండా రైతులు అంతర పంటల సాగు వైపు మళ్లాలని సూచించారు. ప్రస్తుత వ్యవసాయ సీజన్ ప్రారంభం కావడంతో ఈ విత్తన పంపిణీ కార్యక్రమాన్ని గౌరవ ఎమ్మెల్యే చేతుల మీదుగా ప్రారంభించాలని భావించినట్లు తెలిపారు. అయితే ఎమ్మెల్యే అత్యవసర కారణాల వల్ల అందుబాటులో లేనందున, వారి ఆదేశాలు, సూచనల మేరకు ఈ రోజు రైతులకు ఇబ్బంది కలగకుండా ఈ కార్యక్రమాన్ని త్వరితగతిన నిర్వహించామని ఆయన స్పష్టం చేశారు. ఈ సంవత్సరం వాతావరణంలో 'ఎల్‌నినో' ప్రభావం ఉండే అవకాశం ఉన్నందున రైతులు సాగు విషయంలో అప్రమత్తంగా ఉండాలని రాంబాబు హెచ్చరించారు. వర్షాభావ పరిస్థితులను తట్టుకునేలా నీటి లభ్యత తక్కువగా అవసరమయ్యే ఆరుతడి పంటల సాగును ప్రోత్సహించాల్సిన అవసరం ఉందన్నారు. రైతులెవరూ తొందరపడి నిర్ణయాలు తీసుకొని నష్టపోవద్దని, వాతావరణ పరిస్థితులకు అనుగుణంగా పంటల ప్రణాళికలు వేసుకోవాలని ఆయన హితవు పలికారు. ముఖ్యంగా మార్కెట్‌లో మంచి డిమాండ్ ఉన్న పెసలు, నువ్వులు, కందులు వంటి పప్పుధాన్యాల పంటలకు రైతులు మొదటి ప్రాధాన్యత ఇవ్వాలని చైర్మన్ కోరారు. తక్కువ పెట్టుబడితో, తక్కువ నీటితో ఎక్కువ లాభాలు గడించేందుకు ఆరుతడి పంటలు ఎంతో దోహదపడతాయని వివరించారు. ప్రభుత్వం కూడా ఇలాంటి ప్రత్యామ్నాయ పంటలను ప్రోత్సహిస్తోందని, రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. రైతు శ్రేయస్సే ధ్యేయంగా పనిచేస్తున్న ఇల్లందు ఎమ్మెల్యే కోరం కనకయ్య చొరవను ఈ సందర్భంగా ఆయన కొనియాడారు. ఈ ఏడాది రాష్ట్రంలోనే మొదటిసారిగా వ్యవసాయ శాఖ మంత్రి దృష్టికి సమస్యను తీసుకెళ్లి, మొక్కజొన్న కొనుగోలు కేంద్రాలను ప్రారంభించిన ఘనత మన ఎమ్మెల్యే కనకయ్యకే దక్కుతుందని గుర్తుచేశారు. రైతులకు ఎల్లవేళలా అండగా నిలిచే ప్రభుత్వం మరియు నాయకత్వం మనకు ఉందని ఆయన అన్నారు. చివరగా, వ్యవసాయ శాఖ అధికారులు కూడా క్షేత్రస్థాయిలో చురుగ్గా వ్యవహరించాలని రాంబాబు గారు ఆదేశించారు. గ్రామగ్రామాన రైతులకు అంతర పంటలు, ఆరుతడి పంటల సాగుపై విస్తృతంగా అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఇల్లందు పురపాలక చైర్మన్ దొడ్డా కిరణ్, మిత్ర డానెయల్, పట్టణ కాంగ్రెస్ అధ్యక్షులు బొళ్ళ సూర్యం, సొసైటీ డైరెక్టర్ బండారి శ్రీను, కౌన్సిలర్లు సైదిమియా, అజ్మీర వంశీ, జాఫర్, నీలపు రమేష్, నాయకులు సుదర్శన్ కోరి, కమల్ కోరి, తాటి భిక్షం, వ్యవసాయ శాఖ ఏడీ లాల్ చంద్, ఏవో, సొసైటీ సీఈవో హీరాలాల్ తదితరులు పాల్గొన్నారు.







# రైతు భరోసా వెంటనే విడుదల చేయాలి

- బిఆర్ఎస్ పార్టీ కన్వీనర్ దొడ్డి తాతారావు

భద్రాద్రి కొత్తగూడెం జిల్లా, చర్ల మండలం, జూన్ 12(జనసంఘర్షణ):

వర్షాకాల సీజన్ మొదలైంది. రైతులు వ్యవసాయ పనులు కూడా ప్రారంభించారు. అయిన కానీ ఇంతవరకు రైతుబంధు వేయలేదు. గత డిసెంబర్‌లో వేయాల్సిన నిధులు మార్చిలో, ఒక ఎకరంకి వేసి ఇంతవరకు మిగిలిన వాటికి వేయలేదు, మళ్ళీ రెండో విడత రానే వచ్చింది. అయిన కానీ ఈ ప్రభుత్వానికి నిమ్మకు నీరెత్తినట్టు ఉన్నారు. రైతును రాజును చేస్తానని, ఎకరానికి 15 వేలు రైతు భరోసా, కౌలు రైతులకు సంవత్సరానికి 10 వేలు ఇస్తాము అని, పండిన ప్రతీ గింజ కొంటామని, రైతు రుణమాఫీ రైతులందకి చేస్తామని చెప్పి రైతులతో బ్యాంకు లలో అప్పులు కట్టించుకొని కనీసం వారికి సమాధానం చెప్పకుండా, వారికి రుణమాఫీ చేయకుండా మోసం చేస్తున్న ప్రభుత్వం. ఎన్నికల్లో అనేక మాయ మాటలు చెప్పి అధికారంలోకి వచ్చిన తర్వాత రైతులకు ఇచ్చిన హామీలను తుంగలో తొక్కి రైతులను బాధపెడుతుంది కాంగ్రెసు ప్రభుత్వం. అధికారంలోకి వచ్చిన తర్వాత ఈ మూడు సంవత్సరాలలో రైతు బరోసా 3 సార్లు వేసింది మొదటి 3 ఎకరాలకు రెండవ సారి ఒక ఎకరానికి 3 సారి కూడా ఒక ఎకరానికి వేసి చేతులు దులుపుకుంది. గతంలో కెసిఆర్ పరిపాలనలో వ్యవసాయ పనులు ప్రారంభం కాకమునుపే రైతుల అకౌంట్ లలో టింగ్ టింగ్ మంటూ డబ్బులు పడేవి. కానీ ఈ రైతు వంచక ప్రభుత్వంలో ఇప్పటివరకు 6 సార్లు వేయవలసిన రైతు బంధు కేవలం 3 సార్లు మాత్రమే, రైతు బందు డబ్బులు అకౌంట్లో జమ చేశారు. అది కూడా కేవలం ఒకటి, రెండు, ఎకరాలకు మాత్రమే. 2018 నుండి 2023 కెసిఆర్ పాలనలో 11 సార్లు రైతు బంధు వేశారు. ప్రతీ సంవత్సరం మే నెల ఆఖరున డిసెంబర్ నెలలో ఎకరం నుంచి ఎన్ని ఎకరాలు ఉన్న టింగ్ టింగ్ న ఫోన్ లో మెసేజ్ వచ్చేవి. కెసిఆర్ పరిపాలనలో రైతు రాజుల ఉండేవాడు వారి కుటుంబాలు ఏంతో ఆనందంగా ఉండేవారు రాష్ట్రంలో 66 లక్షల రైతులకు 70 వేల కోట్ల రూపాయలు భారతదేశంలో రైతులకు సహాయం చేసిన ఒకే ఒక ముఖ్యమంత్రి కెసిఆర్. 4 లక్షల 50 వేల ఎకరాల పోడు భూములు, లక్ష 50 వేల మంది గిరిజనులకు పట్టాలు వారి కళ్లలో ఆనందం నింపింది బాపు కేసీఆర్. పొడుభూములకు ఇచ్చిన పట్టాలకు రైతు బంధు వేసి గిరిజనులను రారాజును చేశారు కేసీఆర్. రైతులు వర్షాకాలం వానల కోసం ఎదురు చూస్తున్నట్లు, రైతు బంధు కోసం ఎదురుచూస్తున్నారు. ఈ మూడు సంవత్సరాలలో కాంగ్రెస్ ప్రభుత్వం పరిపాలనలో రైతులు అప్పుల్లో కూరుకుపోయారు, తక్షణం రైతు శ్రేయస్సును దృష్టిలో ఉంచుకొని రైతులందరికీ రైతు బంధు వేసి రైతులను ఆదుకోవాలని కోరుతున్నానుఅని అన్నారు.




# ఏసీబి చిక్కిన నర్సింహులపేట ఎంపిడిఓ రాధికా, ఎంపీఓ కిన్నెరా యాకయ్యతో పాటు ఎంపిడిఓ కుమారుడు..

మహబూబాబాద్/జూన్ 12/(జన సంఘర్షణ)

ఏ ప్రభుత్వ కార్యాలయానికి చెందిన లంచం, లంచం ఇవ్వనిదే ఏ పని కూడా కావడం లేదు. ఒకపక్క అవినీతి అధికారులను భారతం పట్టడానికి ఏసీబీ దాడులు కొనసాగిస్తూ అవినీతికి పాల్పడుతున్న అధికారులను పట్టుకొని జైలుకు పంపిస్తున్నప్పటికీ ప్రభుత్వ కార్యాలయంలో అవినీతి మాత్రం ఆగడం లేదు. ఇప్పటివరకు ఈ వారం రోజుల్లో ఏసీబీకి భారీ అవినీతి తిమంగళాలు పట్టుబడ్డాయి. వారి ఇండ్లలో ఏసీబీలు సోదాలు నిర్వహించగా కోట్లాది రూపాయల నోట్ల కట్టలు, కిలోల కద్దీ బంగారం, వెండి, వజ్రాలు, భారీగా స్థిరస్తులు బయటపడ్డాయి. తాజాగా మహబూబాబాద్ జిల్లాలో ఏసీబీకి చిక్కిన ఎంపీడీవో రాధిక, ఏపీఓ కిన్నెర యాకయ్యతో ఎంపీడీవో కుమారుడు ఏసిబికి చిక్కారు. శుక్రవారం పడమటి గూడెం గ్రామంలో ఓ వెంచర్ అనుమతి కోసం లక్ష రూపాయలు సెటిల్ 45 వేలు తీసుకుంటూ ఏ సిబికి రెడ్ హ్యాండెడ్ గా దొరికిన అధికారులు. ఎంపిడిఓ కార్యాలయంలో అన్ని వ్యవహారాలు చక్కపెడుతు ఏసిబికి చిక్కిన ఎంపిడిఓ కుమారుడు.. ఈ కార్యాలయంలో ఎంపీడీవో కుమారుడు ఏది చెప్తే అది వేదం. తన తల్లి ఎంపీడీవోగా పని చేస్తుంటే కుమారుడు పైరవీలు చేస్తూ పెద్ద ఎత్తున ఆఫీస్‌కి వచ్చే ప్రజల నుంచి లంచాల రూపంలో భారీ ఎత్తున డబ్బులు దండుకుంటున్నారు. ఈ విషయం తెలిసి ఏసీబీ అధికారులు శుక్రవారం దాడి చేయగా ముగ్గురు పట్టుబడ్డారు.



# తుడుందెబ్బ ఆధ్వర్యంలో 1/59,1/70 చట్టాల అవగాహన

- వాసం ముసలయ్య పిలుపునిచ్చారు

భద్రాద్రి కొత్తగూడెం జిల్లా, చర్ల మండలం జూన్ 12(జనసంఘర్షణ):

చర్ల మండలం,జూన్ 21 న చర్ల, ఎదురు గుట్టలలో యువతతో సమిష్టి సమావేశానికి వస్తున్న తుడుందెబ్బ రాష్ట్ర అధ్యక్షులు మైపతి అరుణ్ కుమార్, యువత పెద్దఎత్తున తలారి రావాలని పిలుపునిచ్చారు. తుడుందెబ్బ రాష్ట్ర నాయకులు వాసం. ముసలయ్య, చర్ల మండల కేంద్రంలో ఉన్న 26 పంచాయతీలలో ఉన్న ఆదివాసీ యువత జూన్ 21 న జరిగే భవిష్యత్ కార్యాచరణ సమిష్టి సమావేనికి భారీ మొత్తం లో యువత వచ్చి మన హక్కులు, మన చట్టాలపై 1/59,1/70 అనేక అంశలపై మన యువత పూర్తి అవగాహన కలిగి ఉండాలని. అలాగే అక్రమంగా ఎస్టీ జాబితాలో చేర్చిన, లంబాడి సమస్యపై యువతతో చర్చించడనికి, అదేవిధంగా భవిష్యత్‌లో ప్రతి ఆదివాసీ గూడెంలో ప్రతి ఒక్క ఇంట్లో ఒక ఉద్యమ వీరులు కావాలని యువతతో చర్చించడానికి వస్తున్న తుడుందెబ్బ రాష్ట్ర అధ్యక్షులు మైపతి. అరుణ్ కుమార్‌కి ఘన స్వాగతం పలకాలని అయన పిలుపునిచ్చారు. అదేవిధంగా ఏజెన్సీలో 1/70 చట్టాన్ని పూర్తిగా విస్మరిస్తున్న అధికారుపై ఉద్యమలు ఎలా చేయాలి, మన హక్కులు, మన చట్టలు గురించి పూర్తి అవగాహన యువత తెలుసుకోవాలి. అదేవిధంగా 1960 వచ్చిన షెడ్యూల్ ఒడ్డి నిషేధ చట్టం, ఏజెన్సీలో అక్రమంగా వలసలను ఏ విధంగా నిరోధించంలో యువతకు తెలియాలని, ఈ సందర్భంగా మాట్లాడారు. మన జాతి ముద్దు బిడ్డలు ఉద్యమ వీరులను స్ఫూర్తి గా తీసుకొని ముందుకు సాగాలని పిలుపునిచ్చారు.



# రోడ్డు ప్రమాదంలో ముగ్గురికి తీవ్ర గాయాలు

మోస్రా/జూన్ 12/(జన సంఘర్షణ)

మోస్రాలో బస్టాండ్ వద్ద శుక్రవారం రోడ్డు ప్రమాదం జరిగింది. స్థానికుల కథనం ప్రకారం.. రుద్రూర్ మండలం చిక్కడపల్లికి చెందిన శ్రీను, సురేశ్ బైక్పై నిజామాబాద్ నుంచి స్వగ్రామానికి వెళ్తుండా మోస్రా బస్టాండ్ వద్ద నడుచుకుంటూ వెళ్తున్న శంకర్ను ఢీకొట్టారు. ఈ ప్రమాదంలో ముగ్గురికి తీవ్ర గాయాలయ్యాయి. చందూర్ 108 సిబ్బంది రాంబాబు, హన్మండ్లు ప్రథమ చికిత్స చేసి నిజామాబాద్ జిల్లా ఆసుపత్రికి తరలించారు.



# నిజం సాగర్లో విషాదం

- నిజం సాగర్ ప్రాజెక్టులో ఇద్దరు పిల్లల్ని పడేసి తండ్రి దూకి ఆత్మహత్య
- సంగారెడ్డి జిల్లా నిజాంపేట్ గ్రామానికి చెందిన వారీగా గుర్తింపు
- ఎల్లారెడ్డి రిస్క్ టీం అగ్నిమాపక టీం సహాయంతో ఇద్దరు పిల్లల మృతదేహాలు వెలికితీత
- తండ్రి మృతదేహం కోసం గాలింపు
- కుటుంబ కలహాలే కారణమా.. ఆర్థిక ఇబ్బందుల

నిజాంసాగర్ ప్రతినిధి /జూన్ 12/(జన సంఘర్షణ)


క్షణిక ఆవేశం నిండు ప్రాణాలు బలైతున్నాయి. కుటుంబ సమస్యలు, కుటుంబ కలహాలు, ఆర్థిక ఇబ్బందులు కొన్ని కుటుంబాలను విచ్ఛిన్నం చేస్తున్నాయి. కొంతమంది ఆర్థిక ఇబ్బందులు తాళలేక, మరొకవైపు కుటుంబ సమస్యలతో బాధపడుతూ కన్న పిల్లల్ని చంపి తల్లిదండ్రులు ఆత్మహత్యలు చేసుకుంటున్న ఘటనలు మనము ఎన్నో వెలుగు చూస్తూనే ఉన్నాం. తాజాగా కామారెడ్డి జిల్లా నిజాంసాగర్ ప్రాజెక్టులో 20 గేట్ల వద్ద తండ్రి ఇద్దరు పిల్లల్ని నిజాంసాగర్ ప్రాజెక్టులోకి పడేసి, తండ్రి కూడా ప్రాజెక్టులకు దూకి ఆత్మహత్యకు పాల్పడ్డారు. ఈ ఘటన పలువురిని కలిసి వేసింది. సంగారెడ్డి జిల్లా నిజాంపేట్ గ్రామానికి చెందిన బోయి కృష్ణ తన ఇద్దరు పిల్లలైన బోయి రక్షిత్, బోయి అనున్య నిజాంసాగర్ ప్రాజెక్టు చూపిస్తానని తీసుకువచ్చి శుక్రవారం ఉదయం ఎవరు లేని సమయంలో నిజం సాగర్ ప్రాజెక్టులోకి ఇద్దరు పిల్లల్ని పడేసి తండ్రి కూడా ప్రాజెక్టులకు దూకి ఆత్మహత్యకు పాల్పడ్డారు. ఈ విషయం తెలుసుకున్న వెంటనే ఎల్లారెడ్డి రిస్క్ టీం ఎస్సై శివకుమార్ ఆధ్వర్యంలో, అగ్నిమాపక సిబ్బంది కలిసి నిజాంసాగర్ ప్రాజెక్టులో గాలింపు చర్యలు చేపట్టారు చివరికి ఇద్దరు చిన్నారుల మృతదేహాలను బయటకు తీశారు. తండ్రి బోయి కృష్ణ మృతదేహం కోసం గాలింపు చర్యలు కొనసాగుతున్నాయి.



జన సంఘర్షణ
శనివారం
13 జూన్ 2026

# ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణపై బీఎల్ఏలకు అవగాహన కార్యక్రమం





భద్రాద్రి కొత్తగూడెం జిల్లా,భద్రాచలం, జూన్ 12(జనసంఘర్షణ):
తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ, టీపీసీసీ ఆధ్వర్యంలో ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ, ఎస్ఐఆర్ కార్యక్రమంపై బూత్ లెవల్ ఏజెంట్లు, బిఎల్ఏకు అవగాహన కల్పించేందుకు ప్రత్యేక సమావేశం నిర్వహించారు. భద్రాచలంలోని తెలంగాణ టూరిజం హరిత హోటల్లో జరగనుంది. ఓటర్ల జాబితా సవరణ ప్రక్రియ, బీఎల్ఏల బాధ్యతలు, ఓటర్ల నమోదు, తొలగింపులు, మార్పులు, అభ్యంతరాల పరిష్కార విధానాలపై సమగ్ర అవగాహన కల్పించారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథులుగా భద్రాచలం ఎమ్మెల్యే డాక్టర్ తెల్లం వెంకట్రావు, కాంగ్రెస్ పార్టీ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అధ్యక్షులు తోట దేవి ప్రసన్న, టీపీసీసీ ఎస్ ఐ ఆర్ సూపర్ ట్రైనర్ కోఆర్డినేటర్ గరిసెల సురేందర్ ముదిరాజ్ హాజరు అయ్యారు. ఈ సందర్భంగా ఓటర్ల జాబితా సవరణ ప్రక్రియలో కాంగ్రెస్ పార్టీ బీఎల్ఏలు చురుకైన పాత్ర పోషించాలని, అర్హులైన ప్రతి ఒక్కరికీ ఓటు హక్కు కల్పించే దిశగా క్షేత్రస్థాయిలో పనిచేయాలని నాయకులు దిశానిర్దేశం చేసారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ పూనం కృష్ణ, ఉప సర్పంచ్ రత్నం కవిత, వార్డు మెంబర్లు, నియోజకవర్గ నాయకులు, కార్యకర్తలు, 179 బూత్ ఏజెంట్లు తదితరులు పాల్గొన్నారు.

# యూరియా బుకింగ్ యాప్‌ను తొలగించాలి

- రైతులకు అవసరం ఉన్నంత యూరియా అందజేయాలి
- భాజపా జిల్లా అధ్యక్షులు దినేష్ పటేల్ తాసిల్దార్‌కు వినతి పత్రం సమర్పణ

నిజామాబాద్ బ్యూరో./జూన్ 12/(జన సంఘర్షణ)
నిజామాబాద్ జిల్లా రుద్రూర్ బిజెపి మండల కమిటీ ఆధ్వర్యంలో రుద్రూర్ తాసిల్దార్ మండలంలో యూరియా గురించి రైతులు పడుతున్న ఇబ్బందుల గురించి వినతి పత్రం ఇవ్వడం జరిగింది. యూరియా బుకింగ్ యాప్ "మండల స్థాయి" ప్రాతిపదికను మార్చి స్థానిక సొసైటీలు/ఫెర్టిలైజర్ షాపులకు అందుబాటులోకి తేవాలని, అలాగే ఎకరానికి యూరియా కేటాయింపులపై స్పష్టత ఇవ్వాలని కోరుతూ...రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఆన్లైన్ ఎరువుల బుకింగ్ యాప్ వల్ల రైతులు క్షేత్రస్థాయిలో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నా, ప్రభుత్వంగానీ, అధికారులు గానీ ఏమాత్రం పట్టించుకోవడం లేదు. అయితే, ప్రస్తుత విధానంలో యాప్ ద్వారా యూరియాను బుక్ చేసుకునేందుకు 'మండలాన్ని' ప్రామాణికంగా తీసుకోవడం క్షేత్రస్థాయిలో రైతులకు ఇబ్బందులను కలిగిస్తోంది.మండల కేంద్రం లేదా యాప్ సూచించిన పంపిణీ కేంద్రాలు అనేక గ్రామాలకు దూరంగా ఉంటున్నాయి. దీనివల్ల బుక్ చేసుకున్న యూరియా బస్తాలను తమ గ్రామాలకు తరలించుకోవడానికి రైతులు అదనపు రవాణా ఖర్చులు భరించడంతో పాటు వ్యయప్రయాసలకు గురవుతున్నారు. ఈ సమస్య పరిష్కారానికి, యాప్ 'మండల యూనిట్ కి ' బదులుగా రైతులకు అత్యంత చేరువలో ఉండే ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాలను లేదా స్థానికంగా ప్రభుత్వ గుర్తింపు పొందిన ఫెర్టిలైజర్ దుకాణాలను పంపిణీ యూనిట్లుగా మార్చాలని కోరుతున్నాము. అలాగే, ప్రస్తుత సీజన్కు సంబంధించి మండలంలో రైతులు ఇప్పటికి వరి నాట్లు వేసి పనుల్లో నిమగ్నమై ఉన్నారు. కానీ, ఇప్పటి వరకు ఒక ఎకరానికి ఎన్ని బస్తాల యూరియాను కేటాయిస్తారనే అంశంపై ప్రభుత్వ స్థాయి నుంచి ఎలాంటి అధికారిక స్పష్టత



లేదు. ఇది రైతాంగంలో తీవ్ర అయోమయానికి దారితీస్తోంది.ఇందూరు జిల్లా అధ్యక్షులు దినేష్ పటేల్ గులాచారి ఆధ్వర్యంలో రుద్రూర్ బిజెపి మండల కమిటీ సభ్యులతో తాసిల్దార్ కి వినతి పత్రం ఇవ్వడం జరిగింది కావున, దయచేసి పై విషయాలను సానుకూలంగా పరిశీలించి, యూరియా బుకింగ్ యాప్లో తక్షణమే తగిన సాంకేతిక మార్పులు చేసి, అలాగే ఎకరానికి యూరియా కేటాయింపులపై స్పష్టమైన మార్గదర్శకాలు జారీ చేసి రైతులను ఆదుకోవాలని భాజపా జిల్లా అధ్యక్షుడు దినేష్ పటేల్ విజ్ఞప్తి చేశారు.

# మద్నూర్‌లో నూతన నారాయణి పాఠశాల ప్రారంభం

జుక్కల్/జూన్ 12/(జన సంఘర్షణ)
మండల కేంద్రంలో బుధవారం నూతనంగా నారాయణి ఇంగ్లీష్ మీడియం (ప్రయివేటు) పాఠశాల అన్ని హంగులతో ప్రారంభమైంది. జుక్కల్ మాజీ ఎమ్మెల్యేలు ఎస్ గంగారాం, హనుమంతు షిండే, స్థానిక సర్పంచ్ ఉషా సంతోష్ మేస్త్రి, మద్నూర్, డోంగ్లి, మండలాల్లోని అన్ని గ్రామాలకు చెందిన సర్పంచులు, ప్రజా ప్రతినిధుల మధ్య ప్రారంభ వేడుక ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా పాఠశాల డీన్ చంద్రశేఖర్ గౌడ్ మాట్లాడుతూ.. నర్సరీ నుంచి ఏడవ తరగతి వరకు ఇక్కడ 20 ఏండ్ల అనుభవజ్ఞులైన ఉపాధ్యాయులతో పాఠశాల నిర్వహిస్తామని అన్నారు. అధ్యాపకుల అనుభవంతో విద్యార్థులకు ఒత్తిడి లేని, నాణ్యమైన విద్య అందిస్తామని తెలిపారు. నవోదయ, సైనిక్ ప్రవేశాల కోసం నిపుణులతో దీర్ఘకాలిక శిక్షణనందిస్తామని చెప్పారు. అంతేకాదు మా పాఠశాలకు రాష్ట్ర ప్రభుత్వ గుర్తింపు కూడా ఉందన్నారు. ఇక్కడ సౌకర్యవంతమైన తరగతి గదులతో పాటు




విశాలమైన ప్లేగ్రౌండ్ ఉన్నాయని అన్నారు. నారాయణి పాఠశాల ప్రారంభోత్సవానికి స్కూల్ చైర్మన్ సోమూర్ కాశీనాథ్ పటేల్, వైస్ చైర్మన్ లింబూర్ బస్వంత్ రావు పటేల్, కరస్పాండెంట్, డైరెక్టర్లు అవల్గావ్ నాగనాథ్ పటేల్, ప్రధానోపాధ్యాయులు వై ఇరువంత్, మద్నూర్ మోదాని సురేష్ సేట్, కొడిచెర వీరభద్ర లతో పాటు అధిక సంఖ్యలో స్థానికులు హాజరై, విజయవంతం చేశారు.

# తెలంగాణ రక్షణ సేన జెండా ఆవిర్భావ కార్యక్రమం






మద్నూర్ మండలంలో ఘనంగా నిర్వహించిన తెలంగాణ రక్షణ సేన జెండా పండుగ కార్యక్రమంలో పాల్గొన్న ముఖ్య అతిథులు, నాయకులు కామారెడ్డి జిల్లా ఆఫజ్వావార్ కోలా శ్రీనివాస్, రాష్ట్ర నాయకురాలు వరలక్ష్మి, కామారెడ్డి జిల్లా అధ్యక్షులు సంపత్గౌడ్, కామారెడ్డి జిల్లా యూత్ ప్రెసిడెంట్, ఎండ్ ఆదిల్, సురేష్ గౌడ్, వైస్ ప్రెసిడెంట్ సాయిలు మిర్రెవర్, జుక్కల్ నియోజకవర్గ ఇంచార్జ్ రాజశేఖర్, సంజీవ్ బొరిగి, మద్నూర్ మండల అధ్యక్షులు మారుతి, ఈ కార్యక్రమంలో తదితరులు పాల్గొన్నారు. 'తెలంగాణ ఆత్మగౌరవం – తెలంగాణ రక్షణ సేన లక్ష్యం రక్షణ సేన లక్ష్యం' మద్నూర్ మండలం హనుమాన్లు బండివార్ – మద్నూర్ పేర్కొన్నారు.

# మద్నూర్: జిల్లా సభకు తరలివెళ్లిన జర్నలిస్టులు

మద్నూర్/జున్12/(జన సంఘర్షణ)




మద్నూర్ మండలానికి చెందిన జర్నలిస్టులు జిల్లా కేంద్రంలో జరిగే టీయు డబ్ల్యూజే (ఐజేయు) సమావేశానికి శుక్రవారం ఉదయం తరలి వెళ్లారు. సమావేశంలో జిల్లా నూతన కార్యవర్గాన్ని ఎన్నుకోనున్నట్లు వారు పేర్కొన్నారు. ప్రెస్ క్లబ్ అధ్యక్షుడు సందూర్ హన్మండ్లు, జిల్లా కార్యవర్గ సభ్యుడు నవనీత్ రాజ్, శివాజీ అప్ప, కర్రెవార్ బాలాజీ, రాచూరే సుభాష్, సోపాన్ రావ్, ఆకుల్ పండరి, శ్రీధర్ తదితరులు తరలి వెళ్లారు.

# డీసీఎం వ్యాన్ ఢీకొని 20 మేకల మృతి

- మేకల కాపరికి తీవ్ర గాయాలు, ఆసుపత్రికి తరలింపు
- ఎల్లారెడ్డి పోలీసుల దర్యాప్తు

లింగంపేట,/ జూన్ 12/( జన సంఘర్షణ)
కామారెడ్డి జిల్లా లింగంపేట ఎల్లారెడ్డి మండలాల సరిహద్దు కొట్టాల్ గ్రామ స్టేజి వద్ద శుక్రవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో 20 మేకలు మృతిచెందాయి. మేకల కాపరి తీవ్రంగా గాయపడ్డాడు.



**ప్రమాదం వివరాలు**

గ్రామస్తుల కథనం ప్రకారం కొట్టాల్కు చెందిన ఆలకుంట శివయ్య, బోదాస్ గంగారాం, కిషన్ తమ మేకలను కొట్టం నుంచి వదిలి మేత కోసం అడవికి తోలుకెళ్తున్నారు. అదే సమయంలో కామారెడ్డి వైపు నుంచి ఎల్లారెడ్డి వైపు అతివేగంగా వచ్చిన డీసీఎం వ్యాన్ మేకలను, కాపరి శివయ్యను ఢీకొట్టింది.

**నష్టం వివరాలు**

ఈ ప్రమాదంలో ఆలకుంట శివయ్యకు చెందిన 13 మేకలు, బోదాస్ గంగారాంకు చెందిన 2 మేకలు, కిషన్కు చెందిన 5 మేకలు అక్కడికక్కడే మృతిచెందాయి. డీసీఎం తాకిడికి శివయ్య తలకు బలమైన గాయమై అపస్మారక స్థితిలోకి వెళ్లాడు.

**ఆసుపత్రికి తరలింపు**

తీవ్రంగా గాయపడిన శివయ్యను 108 అంబులెన్స్లో ఎల్లారెడ్డి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ప్రస్తుతం ఆయన పరిస్థితి సీరియస్గా ఉందని వైద్యులు తెలిపారు.


**పోలీసుల దర్యాప్తు**

సమాచారం అందుకున్న ఎల్లారెడ్డి పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని ప్రమాదంపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

# పోలీస్ అభ్యర్థుల సమస్యలు పరిష్కారించాలి

- పొదెం వీరయ్యకి వినతిపత్రం

భద్రాద్రి కొత్తగూడెం జిల్లా,భద్రాచలం, జూన్ 12(జనసంఘర్షణ):
తెలంగాణ రాష్ట్ర పోలీస్ నియామకాల కోసం సిద్ధమవుతున్న అభ్యర్థులు తమ న్యాయమైన డిమాండ్ల సాధన కోసం తెలంగాణ రాష్ట్ర అటవీ అభివృద్ధి కార్పొరేషన్ చైర్మన్, భద్రాచలం మాజీ శాసనసభ్యులు పొదెం వీరయ్యకి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా అభ్యర్థులు మాట్లాడుతూ..




పోలీస్ కానిస్టేబుల్ అభ్యర్థుల గరిష్ట వయోపరిమితిని 36 సంవత్సరాలకు, ఎస్సై అభ్యర్థుల వయోపరిమితిని 37 సంవత్సరాలకు పెంచాలని కోరారు. అలాగే రాష్ట్రంలో ఖాళీగా ఉన్న సుమారు 20 వేల పోలీస్ పోస్టులకు సంబంధించి నియామక నోటిఫికేషన్‌ను వెంటనే విడుదల చేయాలని విజ్ఞప్తి చేశారు. గత కొన్నేళ్లుగా నియామకాల ప్రక్రియలో జరిగిన జాప్యాలు, కోవిడ్–19 ప్రభావం, ఇతర కారణాల వల్ల అనేక మంది నిరుద్యోగ యువత ఉద్యోగ అవకాశాలను కోల్పోయారని వారు పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో ప్రభుత్వం తమ డిమాండ్లను సానుకూలంగా పరిశీలించి తగిన నిర్ణయం తీసుకోవాలని కోరారు. అభ్యర్థులు సమర్పించిన వినతిపత్రాన్ని స్వీకరించిన పొదెం వీరయ్య, వారి సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి న్యాయం జరిగేలా తన వంతు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో పోలీస్ నియామకాల కోసం సిద్ధమవుతున్న పలువురు అభ్యర్థులు పాల్గొన్నారు.

# పొతంగల్: రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి తీవ్ర గాయాలు








జల్లపల్లి/జూన్ 12/(జన సంఘర్షణ)
పొతంగల్ మండలం జల్లపల్లి ఆబాది సమీపంలో శుక్రవారం రోడ్డు ప్రమాదం జరిగింది. ఈ ఘటనలో ఇద్దరు తీవ్రంగా గాయపడినట్లు స్థానికులు తెలిపారు. కల్లూర్ గ్రామానికి చెందిన ఇద్దరు బైక్పై పొతంగల్ నుంచి కల్లూర్ వైపు వెళ్తుండగా వాహనం అదుపుతప్పి రోడ్డుపక్కన ఉన్న చెట్టును ఢీకొట్టినట్లు చెప్పారు. తీవ్రంగా గాయపడిన వారిని స్థానికులు 108 అంబులెన్స్లో బోధన్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

# సదాశివేశ్వర స్వామి ఆలయంలో ప్రదోష పూజ

కార్వేటి నగరం జూన్ 12 (జన సంఘర్షణ):
కార్వేటి నగరం నందలి సుద్ధగుంట సమీపము నందు వెలసిన శిష్ట సౌందర్యవల్లి సమేత సదాశివేశ్వర స్వామి ఆలయంలో శుక్రవారం ఆలయంలో అభిషేకం ప్రత్యేక పూజలు నిర్వహించారు. సాయంత్రం ఆలయం వద్ద నందీశ్వరునికి ప్రదోష పూజ వేద పండితులు మంత్రోచ్చారణ నడుమ అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఆలయం దర్శించుకున్న భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ అధ్యక్షులు మోహన్ రాజు ఉపాధ్యక్షులు కృష్ణ స్వామి రాజు, ప్రసాద్ రెడ్డి, కార్యదర్శి, రాజేంద్రరెడ్డి, కోశాధికారులు ప్రసాద్ రాజు, ప్రసాద్ యాదవ్,జనరల్ సెక్రటరీలు, సుబ్బరాయల్ యాదవ్ సంతానం, ప్రతీత్, ఆర్గనైజింగ్ సెక్రటరీలు బాబు రెడ్డి, మునస్వామి, రమేష్ బాబు భక్తులు మహిళలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.



# యువకులకు క్రికెట్ కిట్లు అందజేత

కోటగిరి/జూన్ 12/(జన సంఘర్షణ)



నిజామాబాద్ జిల్లా కోటగిరి గ్రామంలో కోనేరు చారిటబుల్ ట్రస్ట్ అధినేత బాన్సువాడ నియోజకవర్గం బిజెపి నాయకులు ఎన్నారై కోనేరు శశాంక్ సహకారంతో మాస్టర్ కోచింగ్ సెంటర్ అధినేత పంది ముక్కుల గోపి చేతుల మీదుగా యువకులకు క్రికెట్ కిట్లు అందజేయడం జరిగింది. గోపి మాట్లాడుతూ.. పిల్లలు శారీరకంగా దృఢంగా ఉండాలని ఫోన్‌ని వదిలి గ్రౌండ్లలో సమయం కేటాయించాలని యువకులకు సూచించారు. ఈ కార్యక్రమంలో బిజెపి మండల అధ్యక్షులు వేముల నవీన్ రుద్రూర్ మండల అధ్యక్షుడు అలపాటి హరికృష్ణ, పత్తి సతీష్ తదితరులు పాల్గొన్నారు.

# గ్రోమోర్ పై రైతుల కన్నెర్ర... రహదారిపై రైతుల రాస్తారోకో






బీర్కూర్./జూన్ 12/(జన సంఘర్షణ)

ఇంకా వరి నాట్లు ఊపందుకు ముందే ఉమ్మడి నిజామాబాద్ జిల్లాలో యూరియా కొరత రైతులను వేధిస్తుంది. ప్రతి ఒక్కరూ యాప్ ద్వారా యూరియా బుక్ చేసుకోవాలని చెప్పడం వల్ల యాప్ ఎలా బుక్ చేసుకోవాలో తెలియక అన్నదాతలు ఇబ్బందులు ఎదుర్కొంటుంటే మరొకపక్క రైతులకు అవసరమైన ఎంత యూరియా అందించడంలో అధికారులు, పాలకులు పూర్తిగా విఫ్లమయ్యారు. దీనిని నిరసిస్తూ.బీర్కూర్ మండల కేంద్రంలో గల గ్రోమోర్ ఎరువుల దుకాణంపై శుక్రవారం మండలంలోని ఆయా గ్రామాల రైతులు కన్నెర్రజేశారు. ఈ సందర్భంగా ఇప్పటికే ప్రభుత్వం రైతులకు యూరియా అందించడంలో రకరకాల ఇబ్బందులు పెడతా ఉంటే బీర్కూర్ లో గల గ్రోమోర్ సిబ్బంది మరింతగా రైతులను ఇబ్బందులకు గురి చేస్తున్నారని ఆరోపిస్తూ బీర్కూర్ మండల కేంద్రంలోని మల్లాపూర్ చౌరస్తాలో గల రోడ్డుపై భైఠాయించి ధర్నా చేపట్టారు. ఈ విషయం తెలుసుకున్న బీర్కూర్ సర్పంచ్ అరిగే ధర్మతేజ రైతులకు మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ.. రాష్ట్రంలో అధికారంలో ఉన్న కాంగ్రెస్ ప్రభుత్వం రైతులకు ఎరువులు అందించడంలో పూర్తిగా విఫలమైందని విమర్శించారు. రైతులకు ఎరువుల విషయంలో నిర్లక్ష్యం వహించిన గ్రోమోర్ సిబ్బందిపై వెంటనే వ్యవసాయ అధికారులు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో రైతులు పాల్గొన్నారు.

# అన్ని వర్గాలను వెన్నుపోటు పొడిచిన ఘనత చంద్రబాబుది

- మాజీ డిప్యూటీ సీఎం నారాయణస్వామి
- వెన్నుపోటుకు రెండేళ్లు కార్యక్రమానికి భారీగా తరలివచ్చిన వైసీపీ శ్రేణులు

గంగాధర నెల్లూరు (జన సంఘర్షణ)

అన్ని వర్గాలను మోసం చేసిన ఘనత ముఖ్య మంత్రి చంద్రబాబు నాయుడుకే దక్కుతుందని మాజీ డిప్యూటీ సీఎం నారాయణస్వామి అన్నారు శుక్రవారం గంగాధర నెల్లూరు నియోజకవర్గ కేంద్రంలో వెన్నుపోటు కు రెండేళ్లు కార్యక్రమం నిర్వహి ంచారు. ఇండియన్ పెట్రోల్ బంక్ నుండి ఎంపీడీవో కార్యాలయం వరకు భారీ ఎత్తున ర్యాలీ నిర్వహించారు అక్కడున్న అంబేద్కర్ విగ్రహం రాజశేఖర్ రెడ్డి విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు ఈ సందర్భంగా మాజీ డిప్యూటీ సీఎం నారాయణస్వామి మాట్లాడుతూనేను సమితి ప్రెసిడెంట్ నుంచి డిప్యూటీ సీఎం వరకు ఎదిగాను నన్ను ఎమ్మెల్యే తిట్టినా దూషించిన నేనే మాట్లాడను నేనేంటో నేను చేసిన అభివృద్ధి ఏమిటో చంద్రబాబు నాయుడు కి తెలుసు రానున్న ఎన్నికల్లో ప్రజలే బుద్ధి చెబుతారు అని నారాయణస్వామి ఆరోపించారు..అనంతరం జీడి నెల్లూరు వైసిపి ఇంచార్జ్ కృపా లక్ష్మీ మాట్లాడుతూ టిడిపి ప్రభుత్వంలో ప్రజలను వెన్నుపోటు పొడుస్తున్నారని ఎన్నికల్లో ఇచ్చిన హామీలను నెరవేర్చకుండా దౌర్జన్యాలు దోపిడీలు చేస్తున్నారని వైసీపీ ఇన్చార్జి కృపా లక్ష్మి మండిపడ్డారు.. ఎలా నెరవేర్చలేదని మండిపడ్డారు.

# శ్రీసిటీలో సీఐఐ రాష్ట్ర కౌన్సిల్ సమావేశం

- భౌగోళిక రాజకీయ సవాళ్లు, వ్యాపార వృద్ధి అవకాశాలపై చర్చ







వరదయ్యపాలెం :శ్రీసిట(జన సంఘర్షణ):

శ్రీసిటీలో కాన్ఫెడరేషన్ ఆఫ్ ఇండియన్ ఇండస్ట్రీ (సీఐఐ) ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర కౌన్సిల్ రెండో సమావేశం గురువారం సాయంత్రం నిర్వహించారు. ఈ సమావేశంలో పరిశ్రమల సుస్థిరత, మార్కెట్ అవకాశాలు, పరస్పర సహకారం వంటి అంశాలపై పారిశ్రామికవేత్తలు చర్చించారు. స్వర్ణ ఆంధ్ర పి4 ఫౌండేషన్ వైస్ చైర్మన్ సి. కుటుంబరావు ముఖ్య అతిథిగా పాల్గొని "భౌగోళిక రాజకీయ అనిశ్చితులు పరిశ్రమలపై చూపుతున్న ప్రభావం – వాటిని ఎదుర్కొనే వ్యూహాలు" అనే అంశంపై ప్రసంగించారు. మారుతున్న ప్రపంచ పరిస్థితులకు అనుగుణంగా పరిశ్రమలు వినూత్నత, అనుకూలత, ముందుచూపుతో కూడిన వ్యూహాలను అవలంబించాలని సూచించారు. దిగుమతులపై ఆధారపడడాన్ని తగ్గించి, సరఫరా గొలుసు వ్యవస్థలను మరింత బలోపేతం చేయాల్సిన అవసరముందని కుటుంబరావు పేర్కొన్నారు. దేశంలోనే ఉత్తమ పారిశ్రామిక క్లస్టర్‌గా శ్రీసిటీని అభివర్ణిస్తూ, ఎల్‌జీ, డైకిన్, క్యారియర్ వంటి అంతర్జాతీయ సంస్థలు మరియు వాటి సరఫరా సంస్థల అభివృద్ధికి శ్రీసిటీ పారిశ్రామిక అనుకూల వాతావరణం దోహదపడిందన్నారు. ఈ సందర్భంగా నేషనల్ స్టాక్ ఎక్స్ఛేంజ్ (ఎన్ఎస్ఈ) చీఫ్ మేనేజర్ సెంథిల్ మురుగన్ ఎస్ఎంఈ ఐపీఓలు, స్టాక్ మార్కెట్ లిస్టింగ్ అవకాశాలపై ప్రజెంటేషన్ ఇచ్చారు. చిన్న, మధ్య తరహా సంస్థలు మూలధన మార్కెట్ల ద్వారా నిధులు సమీకరించి వేగంగా అభివృద్ధి చెందవచ్చని వివరించారు. శ్రీసిటీ మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ రవీంద్ర సన్నారెడ్డి తన సందేశంలో, సీఐఐ రాష్ట్ర కౌన్సిల్ సమావేశానికి ఆతిథ్యం ఇవ్వడం ద్వారా సుస్థిర అభివృద్ధిలో శ్రీసిటీ పాత్ర ప్రతిబింబిస్తుందన్నారు.

# ప్రజల ప్రేమాభిమానాలు, నారా లోకేష్ ప్రొత్సాహంతోనే సభ విజయవంతం..

- టిడిపి రాష్ట్ర అధికార ప్రతినిధి డాక్టర్ కోడూరు బాలసుబ్రమణ్యం..

తిరుపతి, జూన్ 12 (జన సంఘర్షణ):

ఎన్డీఏ పాలన రెండు సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా తిరుపతిలో నిర్వహించిన విజయోత్సవ సభ ప్రజల ప్రేమాభిమానాలు కార్యకర్తల కష్టం నారా లోకేష్ ప్రోత్సాహమే విజయవంతం కావడానికి రహస్యమని తెలుగు దేశం పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి డాక్టర్ కోడూరు బాలసుబ్రమణ్యం తెలిపారు. విజయోత్సవ సభకు శుక్రవారం తిరుపతి నగరంలోని పలు డివిజన్లో నుంచి డాక్టర్ కోడూరు బాలసుబ్రమణ్యం ఆధ్వర్యంలో సుమారు 2000 మంది పార్టీ నాయకులు, కార్యకర్తలు వచ్చే ర్యాలీగా తరలివచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత వారం రోజులుగా విజయోత్సవ సభ ఏర్పాట్లు సమన్వయం, జన సమీకరణ, ప్రచార కార్యక్రమాలు , క్లస్టర్ హెడ్ లకు వార్డు నాయకులకు బూత్ కన్వీనర్లు కేఎస్ఎస్ బృందాలు యువత మహిళలు కార్యకర్తలు అందరికీ ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. ఈ విజయోత్సవ సభ ఏ ఒక్కరి కృషి వల్ల కాదని తెలుగుదేశం పార్టీ కుటుంబం మొత్తం కలసికట్టుగా సమన్వయంతో సమిష్టి యజ్ఞమని చెప్పారు. రాష్ట్రంలోని పలు జిల్లాల నుండి ప్రజలు స్వచ్ఛందంగా కుటుంబ సమేతంగా విజయోత్సవ సభకు తరలి వచ్చారని, వర్షాన్ని సైతం లెక్కచేయకుండా సభలో ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ప్రసంగిస్తున్నప్పుడు అక్కడే ఉండిపోయారన్నారు. ఈ సభ విజయవంతం కావడంతో మాకు మరింత ఉత్సాహాన్ని ఇచ్చిందన్నారు. సభ అనంతరం తిరుగు ప్రయాణమైన నారా లోకేష్ ను డాక్టర్ కోడూరు బాలసుబ్రమణ్యం మర్యాదపూర్వకంగా కలిశారు. నారా లోకేష్ కోడూరు బాలసుబ్రమణ్యం వెన్ను తట్టి తిరుపతి నియోజకవర్గం లో పార్టీ బలోపేతం కోసం పనిచేయండి భవిష్యత్తులో మీకు మంచి జరుగుతుంది అని చెప్పడంతో డాక్టర్ బాలసుబ్రమణ్యం కు మరింత ఉత్సాహాన్ని ఇచ్చింది. అధినాయకత్వం తన కార్యకర్తల శ్రమను గుర్తించి ప్రోతించినప్పుడే వచ్చే ఆత్మవిశ్వాసం వెలకట్టలేనిదని పేర్కొన్నారు. ఈ విజయాన్ని ప్రజలకు అంకితం చేస్తున్నామని తిరుపతి ప్రజల ప్రేమ కార్యకర్తల అంకితభావం నాయకత్వం పట్ల ఉన్న విశ్వాసమే ఈ విజయోత్సవ సభను ఘన విజయంగా నిలబెట్టాయని అన్నారు. ప్రజల ఆశీర్వాదం కార్యకర్తల శ్రమ నాయకత్వం దిశ నిర్దేశం ఇవే విజయానికి మూడు స్తంభాలాన్ని డాక్టర్ కోడూరు బాలసుబ్రమణ్యం తెలిపారు.



# శ్మశానవాటికను ఆక్రమించే కుట్ర..

- ఆందోళనలో..వై.కా.పా. నాయకులు

మనుబోలు,12.6.2026(జన సంఘర్షణ)





మండలంలోని అక్కంపేట స్మశానాన్ని కొందరు కూటమి నాయకులు కబ్జా చేస్తున్నారని వైకాపా నాయకులుశుక్రవారం ఆందోళనకు దిగారు. శుక్రవారం మీడియాకి ఈ సమాచారం ఇచ్చి స్మశానాన్నిప్రెస్ ని తీసుకెళ్లారు. కొందరు కూటమి నాయకులు ఎలా కబ్జా చేస్తున్నారని చూపించారు.సర్వే నెంబర్ 12 లోని 2.58 సెంట్ల హిందూ గ్రామ శ్మశానవాటికను, గతంలో సర్పంచ్ గా ఉన్న నారపరెడ్డి కిరణ్ కుమార్ రెడ్డి ఎంతో కృషి చేసి పునరుద్ధరించారు. ఆక్రమణలను తొలగించి, సిమెంటు రోడ్లు వేయించి, చుట్టూ ప్రహరీ గోడ కట్టించి, దానిని పంచాయతీ ఆస్తిగా నిలబెట్టారు. కానీ, నేడు అదే శ్మశానవాటికపై స్థానిక కూటమి నాయకులు కబ్జా పై వై. కా. పా నాయకులు తీవ్ర ఆందోళన కలిగిస్తోంది. ఎటువంటి అనుమతులు లేకుండానే, శ్మశానవాటికలోకి ప్రవేశించిన సదరు నాయకులు, అక్కడ ఉన్న పశువుల నీటి కుంట (జాన్ర గుంట )ను పూడ్చివేసి కంప చెట్లను, పిచ్చి మొక్కలను తొలగిస్తూ ఆక్రమణలకు ప్రయత్నిస్తున్నారని చెప్పారు.ఈ విషయాన్ని గమనించి అధికారులు అడ్డుకునే ప్రయత్నం చేసినా, వారిని కూడా పక్కకు పెట్టి, మళ్ళీ మళ్ళీ వచ్చి పనులు కొనసాగిస్తున్నారని చెప్పారు. శ్మశానవాటికను ఆక్రమించుకొని తమ పబ్బం గడుపుకోవాలని చూస్తున్న నాయకుల తీరుపై వాళ్ళు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. రెండు రోజులుగాజేసీబీ తో చేస్తున్నపనులు చూసి పంచాయతీ ఆస్తిని, సామాజిక అవసరాల కోసం కేటాయించిన స్థలాన్ని కాపాడాలని మాప్రయత్నం. "ఇది మా గ్రామ పంచాయతీకి చెందిన శ్మశానవాటిక. గతంలో ఎంతో శ్రమపడి దీనిని అభివృద్ధి చేసుకున్నాం. ఇప్పుడు కొంతమంది నాయకులు దీనిని ఆక్రమించుకోవాలని చూస్తున్నారని తెలిపారు అధికారులను కూడా లెక్కచేయకుండా వారు చేస్తున్న పనులను అరికట్టి, మా శ్మశానవాటికను కాపాడాలి" అని వై. కా. పా. నాయకులు డిమాండ్ చేసారు. ఆ నాయకుల భారీ నుండి స్మశానం స్థలాన్ని కాపాడవలసిందిగా వై. కా. పా నాయకులు కోరుతున్నారు. ఈ విషయంపై ఉన్నతాధికారులు తక్షణమే స్పందించి, తగు చర్యలు తీసుకోవాలని వారు విజ్ఞప్తి చేస్తున్నారు. ఈ వ్యవహారంలో ఉన్నతాధికారుల కల్పించుకుని స్మశానాన్ని కబ్జా చేయకుండా కాపాడాలని వై. కా. పా నాయకులు అంబటి శ్రీనివాసుల రెడ్డి. పల్లంరెడ్డి శ్రీహరి రెడ్డి (హరి బాబు )పెనమల్లి రామ కృష్ణా రెడ్డి. పూండ్ల శ్రీహరి రెడ్డి. చిల్లకూరు వెంకు రెడ్డి. దండు అమర్ రెడ్డి.బీమవరపు రామయ్య విజ్ఞప్తి చేశారు.

# మడమనూరులో వన్ మంత్ - వన్ విలేజ్

మనుబోలు,. 12.6.2026(జన సంఘర్షణ)



మండలంలోని మడమనూరు గ్రామంలో శుక్రవారం నిర్వహించిన వన్ మంత్ - వన్ విలేజ్ కార్యక్రమానికి గ్రామస్తుల నుంచి మొత్తం నాలుగు అర్జీలు వచ్చాయని తాసిల్దార్ ఇండ్ల రమాదేవి తెలిపారు ప్రజా సమస్యలను నేరుగా తెలుసుకుని త్వరితగతిన పరిష్కరించాలనే ఉద్దేశంతో నిర్వహించిన ఈ కార్యక్రమంలో అధికారులు ప్రజల నుంచి వినతిపత్రాలను స్వీకరించి నట్లు చెప్పారు .అందిన అర్జీల్లో మూడు అడంగల్ సవరణలకు సంబంధించినవి కాగా, మరో అర్జీ డ్రైనేజీ నీరు పంట పొలాల్లోకి చేరి రైతులు ఇబ్బందులు ఎదుర్కొంటున్న విషయానికి సంబంధించినదిగా ఉంది. సంబంధిత సమస్యలను పరిశీలించి నిబంధనల మేరకు తగిన చర్యలు తీసుకుని పరిష్కరిస్తామని అధికారులు హామీ ఇచ్చారు.ఈ కార్యక్రమంలో ఆర్ ఐ, అరుణ్ ,స్థానిక టీడీపీ నాయకులునీటి సంఘ అధ్యక్షులు నూనె లక్ష్మయ్య గ్రామస్థులు పాల్గొన్నారు.

# ఇరిగేషన్ పనుల్లో అక్రమాలు..

- టెండర్ల పేరుతో అధికార పార్టీ నేతల దోపిడీ - కాంగ్రెస్ పార్టీ ఆరోపణ...
- ప్రెస్ మీట్ లో - నారపరెడ్డి కిరణ్ కుమార్ రెడ్డి(డీసీసీ )





మనుబోలు. 12.6.2026జనసంఘర్షణ

మనుబోలు మండలం అక్కంపేటలో జరుగుతున్న ఇరిగేషన్ పనులపై నెల్లూరు కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు నారపరెడ్డి కిరణ్ కుమార్ రెడ్డి తీవ్ర స్థాయిలో శుక్రవారం విమర్శలు గుప్పించారు. ఈ సందర్భంగా గ్రామంలో శుక్రవారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ నియోజకవర్గంలో 2025-26 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి ఎఫ్.డి.ఆర్ పనుల పేరుతో సుమారు 115 కోట్ల రూపాయల నిధుల మంజూరులో భారీ అవినీతి జరుగుతోందని ఆరోపించారు. గతంలో 5 లక్షల రూపాయలు దాటిన ప్రతి పనిని టెండర్ల ద్వారానే చేపట్టాలనే నిబంధన ఉండేది. అయితే, ప్రస్తుత ప్రభుత్వం కొత్తగా తీసుకువచ్చిన ఒక మెమో ద్వారా ఎఫ్.డి.ఆర్ పనులను 10 లక్షల రూపాయల లోపుకు కుదించి, వాటిని టెండర్లు లేకుండా నామినేషన్ పద్ధతిలో తెలుగుదేశం పార్టీ కార్యకర్తలకు కట్టబెడుతున్నారని మండిపడ్డారు. టెండర్ ప్రక్రియను తప్పించేందుకు, 20 లక్షల రూపాయల విలువైన పనులను కూడా 9.75 లక్షల చొప్పున ముక్కలు చేసి, తమ అనుకుల కాంట్రాక్టులు దక్కించుకునేలా నిబంధనలను తుంగలో తొక్కినట్లు పేర్కొన్నారు. టెండర్లకు వెళ్లినా కూడా అధికార పార్టీ నేతల నుంచి బెదిరింపులు ఎదురవుతున్నాయని ఆరోపించారు. గతంలో తుఫానుల వల్ల వచ్చిన నష్టాల పేరుతో పాత పనులను తిరిగి మంజూరు చేస్తున్నారని, వాస్తవంగా ఆ ప్రాంతంలో పనుల అవసరం లేకపోయినా నిధులు దుర్వినియోగం చేస్తున్నారని విమర్శించారు. సోమశిల ప్రాజెక్టు ఎప్రాన్ దెబ్బతిన్న విషయాన్ని గుర్తు చేస్తూ, అత్యంత కీలకమైన ఆ పనులకు బిల్లులు చెల్లించకపోవడంతో పనులు నిలిచిపోయాయని ఆందోళన వ్యక్తం చేశారు. రాబోయే వర్షాకాలం నాటికి సోమశిల పనులు పూర్తి కాకపోతే, అది మరొక అన్నమయ్య ప్రాజెక్టులా కొట్టుకుపోయే ప్రమాదం ఉందని హెచ్చరించారు. అదేవిధంగా, ఏళ్ల తరబడి రైతుల కలగా ఉన్న బండేపల్లి-దేగపూడి లింక్ కెనాల్ పనులను పూర్తి చేయడంలో శ్రద్ధ చూపకుండా, కార్యకర్తల కోసం నిధులు పంచుకోవడం సరికాదని ధ్వజమెత్తారు. ఈ సందర్భంగా ఆయన కాంగ్రెస్ పార్టీ తరపున ప్రభుత్వంపై పలు డిమాండ్లు చేశారు. అవినీతికి ఆస్కారం కల్పిస్తున్న టెండర్ల నిబంధనలను వెంటనే ఉపసంహరించుకోవాలి. సోమశిల ప్రాజెక్టు పనులను తక్షణమే పూర్తి చేసి, రైతులకు భరోసా కల్పించాలి. పోలవరం ప్రాజెక్టు పూర్తయి కృష్ణా జలాలు సోమశిలకు వచ్చినప్పుడు, కృష్ణా జలాల్లో నెల్లూరు జిల్లాకు సరైన వాటాను కేటాయించాలని జిల్లా మంత్రులను డిమాండ్ చేశారు. జలయజ్ఞం ద్వారా సోమశిల ప్రాజెక్టు సామర్థ్యాన్ని పెంచి, రైతుల పక్షాన నిలబడిన చరిత్ర వైఎస్ రాజశేఖరరెడ్డిదని గుర్తు చేస్తూ.. ప్రస్తుత ప్రభుత్వం ఆ మార్గంలో నడవాలని ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు బండ్ల హరి, షేక్ ఇర్ఫాల్, సీహెచ్. ధనుంజయ్య, షేక్ మోహీబ్, జె. సుధీర్ మల్లికార్జున్ రెడ్డి సంజయ్, కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.


# వెంటిలేటర్ పై ఉన్న రాష్ట్రానికి ఆక్సిజన్ అందించాం

- అందరికీ ఆదర్శంగా ఆంధ్రప్రదేశ్.
- విద్యుత్ భారం లేకుండా స్వర్ణాంధ్ర వైపు అడుగులు.
- హార్టికల్చర్ హబ్ గా రాయలసీమ.
- వంద రోజుల్లో హంద్రీనీవా ను పూర్తి చేసి కుప్పానికి నీరు.
- రాష్ట్రంలో భూవివాదాలకు శాశ్వతంగా చెక్.
- కూటమిది అభివృద్ధి ట్రాక్ రికార్డు- వారిది విధ్వంసం ట్రాక్ రికార్డ్.
- రెండేళ్ల కూటమి ప్రభుత్వ విజయోత్సవ సభలో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు.
- రూ లక్షల కోట్లతో రాయలసీమ ప్రాజెక్టు.
- స్టీల్ ప్లాంట్ ను కాపాడిన చరిత్ర కూటమిది.
- రాష్ట్ర ఐటీ విద్యాశాఖల మంత్రి నారా లోకేష్.
- ప్రజలకు అభివాదం చేసిన కూటమి నాయకులు.




కుప్పం,జూన్ 12 జనసంఘర్షణ:

గత పాలకులు చేసిన విధ్వంసం నుంచి ఇప్పుడు రాష్ట్రాన్ని నిలబడుతున్నామని, వెంటిలేటర్ పై ఉన్న రాష్ట్రానికి ఆక్సిజన్ అందించామని ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు పేర్కొన్నారు. కూటమి ప్రభుత్వం రెండేళ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా శుక్రవారం తిరుపతి సమీపంలోని దామినేడు వద్ద భారీ విజయోత్సవ సభను నిర్వహించారు. ఈ భారీ విజయోత్సవ సభలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు సుదీర్ఘంగా ప్రసంగించారు. ఆంధ్రప్రదేశ్ను అగ్రస్థానంలోఅందరికీ ఆదర్శంగా నిలిపేందుకు అంతా కలిసి కృషి చేస్తున్నామన్నారు. ఒక లక్ష కోట్లతో రాయలసీమ హార్టీ కల్చర్ హబ్ గా మారుతుందన్నారు. రాయలసీమ ప్రాంతంలోని వివిధ ఖనిజాల ద్వారా వేర్వేరు పరిశ్రమలు వస్తాయన్నారు. 100 రోజుల్లోనే హంద్రీనీవా పూర్తి చేసి కుప్పానికి నీళ్లు తెచ్చామన్నారు. కల్యాణి డ్యామ్ కూడా పూర్తి చేసి శ్రీశైలం మల్లన్న నుంచి తిరుపతి వెంకన్న వద్దకు నీళ్లు తెస్తామని అన్నారు. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం విద్యుత్ ఛార్జీలు పెంచకుండా, తొలిసారి ట్రూ డౌన్ చేసి ప్రజలపై భారాన్ని తగ్గించిందని తెలిపారు. రూ.4668 కోట్ల భారాన్ని ప్రజలపై మోపకుండా తామే భరిస్తూ, విద్యుత్ కొనుగోలు వ్యయాన్ని గణనీయంగా తగ్గించేందుకు కృషి చేస్తున్నట్లు పేర్కొన్నారు. పశ్చిమాసియా యుద్ధం వల్ల రకరకాల ఇబ్బందులు వస్తున్నప్పటికీ, 2047 స్వర్ణాంధ్ర దిశగా రాష్ట్రం ముందుకు వెళ్తుంటే గొడ్డలి పార్టీ వెనక్కు లాగే ప్రయత్నం చేస్తోందని మండిపడ్డారు. గ్రత ప్రభుత్వం అడ్డగోలుగా చేసిన జిల్లాల విభజనను సరిచేస్తూ ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా మార్కాపురం, మదనపల్లె, పోలవరం జిల్లాలను కొత్తగా ఏర్పాటు చేశామని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు పేర్కొన్నారు. వివాదాస్పద ల్యాండ్ టైటిలింగ్ యాక్టు రద్దు చేసి, ల్యాండ్ రీసర్వే ప్రక్రియ ద్వారా భూ రికార్డులను ప్రక్షాళన చేస్తూ భూ వివాదాలకు శాశ్వతంగా చెక్ పెడుతున్నామని స్పష్టం చేశారు. దశాబ్దాలుగా నలుగుతున్న శెట్టిపల్లి గ్రామ భూ సమస్యను పరిష్కరించామని చెప్పారు. ప్రజలపై భారం మోపిన చెత్త పన్నును రద్దు చేయడంతో పాటు, రాష్ట్రంలో చెత్తను, పరిపాలనలోని చెత్తను కూడా తొలగిస్తున్నామని, పాలనా సమర్థత పెంచేందుకు అడ్డంకిగా ఉన్న పాత చట్టాలను రద్దు చేస్తున్నామని ప్రకటించారు. మద్య నిషేధం చేశాకే ఓట్లు అడుగుతానన్న వ్యక్తి అధికారంలోకి వచ్చాక ఏం చేశారో అందరికీ తెలుసని విమర్శించారు. జే బ్రాండ్లతో ప్రజారోగ్యాన్ని తీవ్రంగా దెబ్బతీస్తూ, మహిళల మంగళసూత్రాలు తెంచే పరిస్థితి తెచ్చారని మండిపడ్డారు.



వారంలో సీపీఎస్ రద్దు చేస్తానని నమ్మబలికి, అధికారంలో అన్ని వారాలు ఉన్నా ఆ ఊసే ఎత్తలేదని ధ్వజమెత్తారు. అలాగే, ఏటా జాబ్ క్యాలెండర్ ఇస్తామని ఘనంగా ప్రకటించి, ఐదేళ్లలో ఒక్కసారి కూడా విడుదల చేయలేకపోయిందని గొడ్డలి పార్టీపై ధ్వజమెత్తారు. గత పాలకులు తిరుమల ప్రసాదాన్ని కల్తీ చేసి అపవిత్రం చేశారన్నారు. కలియుగ దైవం శ్రీవేంకటేశ్వర స్వామి పట్ల అపచారం చేసి మన అందరి మనోభావాలను దెబ్బతీసేలా గొడ్డలి పార్టీ ప్రవర్తించిందన్నారు. తిరుమల జోలికి బ్రిటీషర్లు కూడా వెళ్లలేదని, కానీ గొడ్డలి పార్టీ ఆ దుర్మార్గం చేసిందన్నారు. ప్రజలకు న్యాయం చేయాలన్నదే జనసేన, టీడీపీ, బీజేపీ పార్టీల లక్ష్యం అన్నారు. విశాఖకు, గూగుల్, కాగ్నిజెంట్, టీసీఎస్ వంటి ఐటీ కంపెనీలు వస్తే, అమరావతికి క్వాంటం వ్యాలీ వస్తోందన్నారు. ఏపీకి పరిశ్రమలు రావాలి, మన రాష్ట్రం పురోగతి సాధించాలి, మన యువతకు ఉద్యోగాలు రావాలి అన్నారు. అందుకే పరిశ్రమలకు అవసరమైన నైపుణ్యాలను కూడా మన యువతకు కల్పిస్తున్నామని అన్నారు సీఎం చంద్రబాబు. గత పాలకుల హయాంలో పెట్టుబడి దారులు రాష్ట్రం నుంచి పారిపోయారని, మళ్లీ ఏపీ బ్రాండ్ పునరుద్ధరించి పెట్టుబడుల్ని, ప్రాజెక్టుల్ని సాధిస్తున్నామన్నారు. స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ ద్వారా పరిశ్రమలకు వేగంగా అనుమతులు ఇస్తున్నామన్నారు. వివిధ పారిశ్రామిక పాలసీల ద్వారా పెట్టుబడిదారుల్లో విశ్వాసాన్ని కల్పించామన్నారు. అందుకే పెట్టుబడులు వస్తున్నాయని, కేవలం 36 రోజుల్లోనే రాయలసీమలోని పుట్టపర్తికి 5వ జనరేషన్ ఫైటర్ జెట్ యుద్ధ విమాన ప్రాజెక్టుకు అనుమతులిచ్చామన్నారు. రాయలసీమ ఇక హార్టీ కల్చర్ హబ్, స్పేస్, డ్రోన్, డిఫెన్సు పరిశ్రమలు వస్తున్నాయని అన్నారు. సంక్షేమం, అభివృద్ధి సుపరిపాలన ఇస్తామని ప్రజలకు హామీ ఇచ్చాం, ఇచ్చినట్టే పాలన అందిస్తున్నామన్నారు. సూపర్ సిక్స్ తో పాటు మేనిఫెస్టోలో హామీల అమలు చేస్తూ ప్రజల నమ్మకాన్ని సాధించామన్నారు. ఎన్టీఆర్ భరోసా ద్వారా రూ.65 వేల కోట్ల పెన్షన్లు, తల్లికి వందనం, స్త్రీశక్తి ద్వారా 71 కోట్ల ఉచిత ప్రయాణాలు కల్పించామన్నారు. అన్నదాత సుఖీభవ కింద కేంద్రంతో కలిసి రూ.20 వేలు ప్రతీ రైతుకూ అందించామన్నారు. 24 గంటల్లోనే ధాన్యం కొనుగోళ్ల డబ్బులు చెల్లిస్తున్నామన్నారు. గీత కార్మికులు, వడ్డెర్లు అర్చకులు, ఇమామ్ లు, మౌజన్లు ఇలా అందరినీ గుర్తుపెట్టుకుని మరీ సంక్షేమం అందిస్తున్నామన్నారు. ఎస్సీ,ఎస్టీ, బీసీల సహా అందరికీ సబ్సీడీపై సోలార్ రూఫ్ టాప్ ద్వారా విద్యుత్ ఉత్పత్తి చేసుకునే అవకాశం కల్పిస్తున్నామన్నారు. పీ4 ద్వారా సమాజంలో జీవన ప్రమాణాలు పెంచేందుకు కృషి చేస్తున్నామని అన్నారు. ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ మాట్లాడుతూ, ఆంధ్రప్రదేశ్ పునర్నిర్మాణం కోసమే కూటమి ఏర్పాటు అయింది అన్నారు. అహంకారం విధ్వంసం పై ప్రజా విజయమని అభివర్ణించారు. అధికారం పంచుకోవడానికి కాదని బాధ్యతలు పంచుకోవడానికి కూటమి ఏర్పాటు అయింది అన్నారు. ఆంధ్రప్రదేశ్ ఐటీ విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ మాట్లాడుతూ, స్టీల్ ప్లాంట్ క్లోజ్ చేసి అక్కడ రాజధాని కడదామనే ఆలోచన వారిదని. మొన్న స్టీల్ ప్లాంట్ లో ప్రమాదం జరిగితే కొంత మంది కార్మికులు చనిపోయాని, చనిపోయిన పర్మినెంట్ ఉద్యోగి కుటుంబానికి ప్రజా ప్రభుత్వం రూ.2కోట్లు ఇస్తుందన్నారు. కాంట్రాక్ట్ ఉద్యోగి కుటుంబానికి ఒకకోటి ఇస్తుందన్నారు. అంతే కాకుండా పర్మినెంట్ జాబ్ కుడా మేము ఇస్తున్నామన్నారు. ఎవరైనా ఎక్కువ ఇవ్వమని అడగొచ్చు. కానీ, జగన్ కోటి ఇవ్వమని డిమాండ్ చేశారన్నారు. 2019 నుండి 2024 వరకు గొడ్డలి పార్టీ అరాచక పరిపాలన మనం చూశాం. బీసీ బిడ్డ అమర్నాథ్ గౌడ్ పై పెట్రోలు పోసి చంపేశారు. దళిత వైద్యుడు సుధాకర్ని పిచ్చోడని ముద్ర వేసి చంపేశారు. డ్రైవర్ సుబ్రహ్మణ్యంను చంపేసి డోర్ డెలివరీ చేశారు. అబ్దుల్ సలామ్ కుటుంబంతో సామూహికంగా ఆత్మహత్య చేసుకునేలా చేశారు. కుటుంబాన్ని విడిచి మిస్బా ఆత్మహత్య చేసుకునేలా చేశారు. టీడీపీ జెండా లేకుండా చేస్తాం అన్నారు, ప్రజలే వాళ్ల జెండా పీకేశారు. వై నాట్ 175 అన్నారు. ప్రజలు టీమ్ 11 ఇచ్చారు. వాళ్లు సిద్ధం అంటే ప్రజలు యుద్ధం అన్నారు. మమ్మల్ని అసెంబ్లీలో అడుగు పెట్టనివ్వం అన్నారు, ప్రజలే వాళ్లని అసెంబ్లీలో అడుగు పెట్టకుండా చేశారు. ఇప్పుడు రప్పా రప్పా అంటున్నారు - ప్రజలే రఫ్ఫాడిస్తారని అన్నారు నారా లోకేష్. ప్రపంచంలో ఎక్కడికి వెళ్లినా మనకి గౌరవం దక్కుతుంది. ప్రపంచం మొత్తం మన దేశం వైపు చూస్తుంది. దానికి కారణం మన ప్రధాని నమో నరేంద్ర మోదీ అన్నారు. ఆయన రికార్డ్స్ బద్దలు కొట్టడం ఎవరి వల్లా సాధ్యంకాదు.

# శ్రీ నందీశ్వరునికి ప్రత్యేక అభిషేకాలు



శ్రీకాళహస్తి జూన్ 12 జనసంఘర్షణ:

శ్రీకాళహస్తిలో వైభవంగా ప్రదోషకాల పూజలుశ్రీకాళహస్తీశ్వర స్వామి దేవస్థానం ప్రాంగణంలోని కాశీ విశ్వనాథ స్వామి ఆలయంలో త్రయోదశిని పురస్కరించుకుని శుక్రవారం ప్రదోషకాల పూజలు వైభవంగా జరిగాయి. సాయంత్రం వేళ ఆలయ అర్చకులు, వేద పండితులు స్వామివారితో పాటు నందీశ్వరునికి పాలు, పెరుగు, తేనె, విభూతి, పన్నీరు వంటి పవిత్ర ద్రవ్యాలతో షోడశోపచార అభిషేకాలు నిర్వహించారు. అనంతరం స్వామివారిని బిల్వపత్రాలు, సుగంధ పుష్పాలతో శోభాయమానంగా అలంకరించి, ధూపదీప నైవేద్యాలు సమర్పించారు. వేద మంత్రోచ్ఛారణలు, భక్తుల శివనామస్మరణలతో ఆలయ ప్రాంగణం మారుమోగింది. లోకకల్యాణార్థం జరిగిన ఈ వేడుకలో భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని స్వామివారిని దర్శించుకుని , అనంతరం వారికి తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు.

# మంత్రి నారా లోకేష్ కు స్వాగతం పలికిన... శ్రీకాళహస్తి ఎమ్మెల్యే



శ్రీకాళహస్తి జూన్ 12 జనసంఘర్షణ:

కూటమి ప్రభుత్వ రెండేళ్ల అద్భుత ప్రగతి ప్రస్థాన విజయోత్సవ బహిరంగ సభలో పాల్గొనేందుకు తిరుపతి దామినేడుకు విచ్చేస్తున్న తెలుగుదేశం పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి, ఐటీ, విద్యాశాఖ మంత్రి ప్రియతమ నేత నారా లోకేష్ అన్న కి రేణిగుంట విమానాశ్రయంలో కూటమి నాయకులు, కార్యకర్తలు అభిమానులతో శ్రీకాళహస్తి శాసనసభ్యులు బొజ్జల సుధీర్ రెడ్డి స్వాగతం పలికారు.

# రెండేళ్ల అభివృద్ధి ప్రదాత సభకు తెలుగు తమ్ముళ్లు



తొట్టంబేడు జూన్ 12 జనసంఘర్షణ:

శ్రీకాళహస్తి నియోజకవర్గ ఎమ్మెల్యే బొజ్జల వెంకట సుధీర్ రెడ్డి ఆదేశాలతో తొట్టం బేడు మండల పార్టీ అధ్యక్షులు రావెళ్ల మునిరాజా నాయుడు ఆధ్వర్యంలో పంచాయతీలో ఉన్న క్లస్టర్, యూనిట్ ఇన్చార్జులు, నాయకులు కార్యకర్తలు రెండేళ్లు అభివృద్ధి ప్రదాత లు రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్,మంత్రి లోకేష్, విజయోత్సవ సభకు అభివృద్ధిని రెండు కళ్ళు గా భావించి రాష్ట్రాన్ని అభివృద్ధి బాటలో నడుపుతున్న సందర్భంగా రాష్ట్రంలోని ప్రజలందరూ కూటమి ప్రభుత్వాన్ని అండగా నిలవాలని మద్దతుగా నిలవాలని రావెళ్ల ముని రాజా నాయుడు కోరారు. ఈ సభకు వారితోపాటు మండల నాయకులు, కార్యకర్తలు, యూనిట్ ఇన్చార్జిలు, తదితరులు పాల్గొన్నారు.

# విశాఖ ఉక్కు ఘటనకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలే బాధ్యత వహించాలి




పలమనేరు జూన్ 12జనసంఘర్షణ :

విశాఖ ఉక్కు ఫ్యాక్టరీలో జరిగిన ఘోర ప్రమాదంలో 9 మంది మృతిచెందారని, అందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలే బాధ్యత వహించాలని జాతీయ మానవ హక్కులు మరియు అవినీతి నిర్మూలన సంస్థ జిల్లా అధ్యక్షులు డి.వి. మునిరత్నం , జిల్లా గౌరవ అధ్యక్షులు మణి డిమాండ్ చేశారు. అందులో భాగంగా శుక్రవారం పలమనేర్ పట్టణంలో గల మానవ హక్కుల కార్యాలయం నందు అమానుల్లా అధ్యక్షతన జరిగిన ఘటనపై సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుండి విశాఖ స్టీల్ ప్లాంట్ ను కార్పొరేట్ శక్తులకు అప్పగించాలనే ప్రయత్నం చేసిందన్నారు. ప్రారంభం నుండి కార్మికుల శ్రమను దార పోయడం వలనే దేశంలోనే నెంబర్ వన్ స్థానంలో స్టీల్ ప్లాంట్ నిలిచిందన్నారు. ప్రస్తుతం ప్రైవేటు యాజమాన్యం చేతుల్లో వెళ్లడం వలన నిర్లక్ష్య వైఖరి అవలంబించడంతో జరిగిన ఘటనలో వెలకట్టలేని మనిషి జీవితాలు బలైపోయాయని ,ఇంత జరుగుతున్నా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు చీమకుట్టినంత చలనం లేకపోవడం బాధాకరమన్నారు. ప్రాణాలు కోల్పోయినప్పుడు, ఆస్తి నష్టం జరిగి, మానవ హక్కుల ఉల్లంఘనకు గురి అయినప్పుడు వామపక్షాలు, ప్రజా సంఘాల నాయకులు పాలకులను, అధికారులను అడిగే అధికారం ఉందని గుర్తు చేశారు. స్టీల్ ప్లాంట్లో తొమ్మిది మంది చనిపోతే పరామర్శించడానికి వచ్చిన మంత్రి నారా లోకేష్, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ ను బాధితులకు న్యాయం చేయాలని కార్మిక నాయకులు అడిగిన ప్రశ్నలకు సరైన సమాధానం చెప్పకుండా ఒక బాధ్యతాయుతమైన పదవిలో ఉంటూ అడిగిన వారి ఇళ్లల్లో ఎవరు చనిపోలేదు కదా అనడం, ఒక్కో ప్రభుత్వంలో కార్మిక సంఘాలు ఒకో రకంగా వ్యవహరిస్తాయని, కార్మిక సంఘాలనే నిలదీయాలనే రెచ్చగొట్టే మాటలు అనడం సబబు కాదన్నారు. కార్మికుల కుటుంబాల్లో పెద్ద దిక్కును కోల్పోయి పుట్టెడు దుఃఖముతో ఉన్నవారికి ఓదార్పుగా వామపక్షాలు, ప్రజా సంఘాలు ముందుంటాయనే విషయం పాలకులు పాఠం నేర్చుకోవాలన్నారు. ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం మేల్కొని విశాఖ ఉక్కును ఆంధ్రుల హక్కుగా భావించి కార్పొరేట్ శక్తుల చేతుల్లో పెట్టకుండా ప్రభుత్వమే బాధ్యత తీసుకొని నిర్వహించే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. ప్రమాదంలో మృతి చెందిన ఒక్కొక్క కుటుంబానికి కోటి రూపాయలు చొప్పున పరిహారంతో పాటు, ఇంటికో ప్రభుత్వ ఉద్యోగం, ఐదు ఎకరాల వ్యవసాయ పొలం, క్షతగాత్రులకు పరిహారముతోపాటు మెరుగైన వైద్యం అందించాలన్నారు.

# యువత డ్రగ్స్‌కు దూరంగా ఉండి ఉజ్వల భవిష్యత్తును నిర్మించుకోవాలి

- సమాజానికి, ప్రజలకు సేవ చేసే వనరుగా యువత ఎదగాలి.
- సూర్యాపేట జిల్లా ఎస్పీ నరసింహ ఐపీఎస్.
- ప్రతిష్ట ఫార్మసీ కళాశాలలో విద్యార్థులకు
- ‘డ్రగ్స్ నిర్మూలన’పై విస్తృత అవగాహన
- ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యాచరణలో భాగంగా కార్యక్రమం
- డ్రగ్స్, గంజాయి నిర్మూలనలో తమ వంతు భాగస్వాములం అవుతాము, గంజాయి అలవాటు ఉన్నవారిలో పరివర్తన తెస్తాం అని విద్యార్థులు ప్రతిజ్ఞ.
- గంజాయి, మాదకద్రవ్యాల పై సమాచారం నిర్మూలనలో భాగస్వామ్యం కావాలి, యువత కష్టపడి చదువుకోవాలి, ఉన్నతమైన స్థాయికి ఎదగాలి అని ఎస్పీ నరసింహ ఐపీఎస్ గారు పిలుపునిచ్చారు.

**సూర్యాపేట**

ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యాచరణలో భాగంగా సూర్యాపేట జిల్లా పోలీస్ శాఖ ఆధ్వర్యంలో చివ్వెంల మండల పరిధిలోని దురాజుపల్లి గ్రామ సమీపంలో గల లిప్రతిష్ట ఫార్మసీ కళాశాలలో విద్యార్థులకు డ్రగ్స్ నిర్మూలన పట్ల విస్తృత అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి సూర్యాపేట జిల్లా ఎస్పీ లిశ్రీ నరసింహ ఐపీఎస్ గారు ముఖ్యఅతిథిగా హాజరై ప్రసంగించారు.

ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ గారు మాట్లాడుతూ మన సమాజం నుండి డ్రగ్స్ తరిమివేసి డ్రగ్స్ రహిత సమాజ నిర్మాణం కోసం తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం కృత నిశ్చయంతో ఉన్నది, దీనికోసం సంబంధిత ప్రభుత్వ అధికారులు, జిల్లా పోలీస్, జిల్లా యంత్రాంగం అనుక్షణం పని చేస్తుంది అన్నారు.

యువత, విద్యార్థులు ఉన్నత లక్ష్యాల వైపు సాధన చేయాల్సి అన్నారు, కష్టపడే వయస్సులో వ్యసనాలకు అలవాటు పడొద్దు, చెడుకు దూరంగా ఉండాలి, మంచి స్నేహితులను, మంచి పుస్తకాలను ఎంచుకోవాలి, తల్లిదండులకు, చదువు నేర్పు గురువులకు మంచి పేరు తేవాలి, సమాజానికి, ప్రజలకు మంచి సేవ చేసే వనరుగా ఎదగాలి అని అన్నారు. మహిళలు, బాలలు, విద్యార్థుల రక్షణలో అనుక్షణం పని చేస్తున్నాము అన్నారు.



ప్రస్తుతం మన సమాజాన్ని, ముఖ్యంగా దేశానికి వెన్నుముక లాంటి యువతను డ్రగ్స్ మహమ్మారి పట్టిపీడిస్తోందని అన్నారు. మాదకద్రవ్యాల వల్ల భావితరాలు తమ ఉజ్వల భవిష్యత్తును చేతులారా కోల్పోతున్నాయని హెచ్చరించారు. డ్రగ్స్‌కు బానిసలైన యువత తీవ్ర అనారోగ్యాల బారిన పడటమే కాకుండా, కుటుంబాలను రోడ్డున పడేస్తున్నారని పేర్కొన్నారు. “దేశ భవిష్యత్తు యువత చేతుల్లోనే ఉంది. అలాంటి యువశక్తి డ్రగ్స్ లాంటి మాదకద్రవ్యాలకు బానిసలైతే దేశ ప్రగతి కుంటుపడుతుంది. డ్రగ్స్ రహిత సమాజ నిర్మాణంలో ప్రతి ఒక్క విద్యార్థి, పౌరుడు భాగస్వాములు కావాలి అన్నారు. జిల్లాలో ఎక్కడైనా డ్రగ్స్, గంజాయి విక్రయాలు జరుగుతున్నా, వాటి మూలాలు ఉన్నా వెంటనే పోలీసు వారికి సమాచారం అందించి సహకరించాలి. సమాచారం ఇచ్చిన వారి వివరాలు గోప్యంగా ఉంచబడతాయి. గంజాయి లేదా ఇతర వ్యసనాలకు బానిసలైన వారు ఎవరైనా ఉంటే, వారిని గుర్తించి సంరక్షణ (పునరావాస) కేంద్రాలకు తరలించి వారి జీవితాల్లో మార్పు తీసుకురావడానికి అందరూ కృషి చేయాలి అన్నారు. జిల్లా పోలీస్ శాఖ డ్రగ్స్ నిర్మూలనకు అనుక్షణం పనిచేస్తోంది. నిత్యం తనిఖీలు నిర్వహిస్తూ, గంజాయి సంబంధిత కేసుల్లో ఉన్న పాత నేరస్థులపై నిఘా ఉంచి, వారికి కౌన్సిలింగ్ ఇస్తున్నాము అన్నారు. డ్రగ్స్ మహమ్మారిని రూపుమాపడంలో యువతరం ముందుండాలని, సమాజ మార్పు కోసం పోలీసులతో చేతులు కలపాలని ఎస్పీ పిలుపునిచ్చారు. డ్రగ్స్, గంజాయి నిర్మూలనలో తమ వంతు భాగస్వాములం అవుతాము, గంజాయి అలవాటు ఉన్నవారిలో పరివర్తన తెస్తాం అని విద్యార్థులు ప్రతిజ్ఞ చేయించడం జరిగినది. ఈ సమాజంలో మరో తీవ్ర అంశాలు రోడ్డు ప్రమాదాలు, సైబర్ మోసాలు అన్నారు. వీటిని అరికట్టాలంటే ప్రజలు అవగాహన, ముందు చూపు, జాగ్రత్తలు ప్రదానం అన్నారు. జీవితంలో ఎదిగి కుటుంబాలకు తల్లిదండ్రులకు అండగా ఉండాల్సిన వారు అజాగ్రత్తగా వాహనాలు నడుపు రోడ్డు ప్రమాదాలకు గురవుతున్నారు అన్నారు. వాహనాలు నడిపేటప్పుడు ముందస్తు జాగ్రతలు పాటించాలి అని కోరారు. అత్యాశకు పోయి అపరిచితులకు మన వ్యక్తిగత సమాచారాన్ని ఇచ్చినట్లయితే మోసాలకు గురి అవుతామని తెలిపారు. సోషల్ మీడియాలో వచ్చే ప్రకటనలు ఫోన్లకు వచ్చే మెసేజ్లను స్పందించి అపరిచితులకు ఎవరు డబ్బులు చెల్లించవద్దు అని కోరారు. బహుమతులు ఉన్నాయి తక్కువ తక్కువ వడ్డీలకు లోన్స్ ఇస్తాము ప్రభుత్వ పథకాలు ఇస్తాము ప్రాసెసింగ్ ఫీజు చెల్లించాలి అంటే అలాంటి సమాచారాన్ని నమీ ఎవరు కూడా అపరిచితులకు డబ్బులు పంపకూడదు అన్నారు.

ఈ కార్యక్రమంలో సూర్యాపేట రూరల్ సిఐ రాజశేఖర్, చివ్వెంల ఎస్ఐ మహేష్, కనకరాత్నం, బరోసా ఎస్ఐ మౌనిక, షీ టీం ఎస్సై నీలిమ, పోలీసు సిబ్బంది కళాశాల యాజమాన్యం డా. రామకృష్ణ, అధ్యాపకులు, పెద్ద సంఖ్యలో విద్యార్థిని, విద్యార్థులు మరియు పోలీస్ అధికారులు సిబ్బంది పాల్గొన్నారు.

## జస్టిస్ కె. జి.బాలకృష్ణన్ దళిత క్రైస్తవుల రిజర్వేషన్లపై గడువు పెంచి గ్రామస్థాయిలో సమగ్ర విచారణ చేపట్టి న్యాయం చేయాలి

- పూజించే దేవుడు మారినా, పడే వివక్ష మారనప్పుడు...
- ఎస్సీ రిజర్వేషన్ల హక్కు ఎందుకు మారాలి?”
- ”కుల వివక్షకు మతంతో సంబంధం లేదు, అది సామాజిక రుగ్మత. దళిత క్రైస్తవులకు ఎస్సీ హోదా ఇవ్వడం రాజ్యాంగబద్ధమైన హక్కు!”
- బిషప్ దుర్గం ప్రభాకర్
- తెలంగాణ రాష్ట్ర క్రిస్టియన్ మైనారిటీ వెల్ఫేర్ అసోసియేషన్ - నాయకులు




**జూన్12 శుక్రవారం :**

సూర్యాపేట రూరల్ మండల కేంద్రం, కేసారం గ్రామం లో బేతెస్థ ప్రార్ధన మందిరం నందు పాస్టర్స్ సమావేశంలో బిషప్ దుర్గం ప్రభాకర్ మాట్లాడుతూ మతం మారిన దళిత క్రైస్తవులకు వివక్ష తప్పట్లేదు అనీ, ఆర్థికంగా, రాజకీయం గా వెనుకనే ఉన్నామని,రిజర్వేషన్ల అమలుపై కేంద్రం నియమించిన సుప్రీంకోర్టు మాజీ ప్రధాన న్యాయమూర్తి, జస్టిస్ కేజీ బాలకృష్ణన్ కమిషన్ నుకు గడువు పెంచాలని, గ్రామ స్థాయిలో కి వచ్చి సమగ్ర విచారణ జరిపి ముస్లింల, సిక్కు, బౌద్ధ మతం వారికి ఎస్సీ హోదా కల్పించినట్టే క్రైస్తవ మతం మారిన దళితులకు ఎస్సీ హోదా కల్పించాలని.ఈ అంశాలపై దాదాపు నాలుగేళ్ల పాటు సుదీర్ఘ అధ్యయనం చేసిన కూడ గ్రామ స్థాయిలో సమగ్ర విచారణ జరుగలేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నామన్నారు.జస్టిస్ కేజీ బాలకృష్ణన్ కమిషన్ నివేదికపై దేశవ్యాప్తంగా ఉత్కంఠ నెలకొన్నది.మతం మారిన తర్వాత కూడా దళితులు సామాజిక వివక్షను తీవ్రంగా ఎదుర్కుంటున్నారు అనీ గతం లో రంగనాథ్ మిశ్ర కమిషన్ ఆరా తీసిందమీ గుర్తు చేస్తూ. రాజకీయాలకు అతీతంగా రాజ్యాంగ బద్దంగా సమన్యాయం చేయాలనీ ,1950 నాటి రాజ్యాంగం ఉత్తర్వు ప్రకారం హిందూ, సిక్కు, బౌద్ధ మతం వారికి యస్సి హోదా కల్పించినట్టు క్రైస్తవులకు కూడా వర్తింప చేయాలి క్రైస్తవ మతాల్లో కుల వ్యవస్థ లేదంటూ ఇప్పటికే సుప్రీంకోర్టులో కేంద్రం తప్పుడు అఫిడవిట్ దాఖలు చేసిందనీ దాన్ని వెనక్కి తీసుకొని క్రైస్తవులకు న్యాయం చేయాలనీ అన్నారు. ఈ కార్యక్రమం లో సువార్త చర్చ్ ఆంధ్ర, తెలంగాణ రాష్టల కో ఆర్డినేటర్ పాస్టర్ సీ. హెచ్. శ్యాంప్రసాద్, సూర్యాపేట నియోజకవర్గ పాస్టర్స్ అధ్యక్షులు రెవ. జలగం జేమ్స్, సూర్యాపేట రూరల్ అధ్యక్షులు యల్క ప్రభాకర్, రెవ. ఏర్పుల క్రిస్టోఫర్, రెవ. పంది మార్కు, బొక్క ఏలీయా రాజు, సి. హెచ్. కిరణ్ కుమార్, యం. రూబెన్ తదితరులు పాల్గొన్నారు.

## ప్రజా రక్షణే ధ్యేయం: సూర్యాపేట జిల్లా పోలీసుల నిరంతర అప్రమత్తత

**సూర్యాపేట**

సమాజంలో శాంతి భద్రతల పరిరక్షణ, నేరాల అదుపు మరియు ప్రజలకు భరోసా కల్పించడం ఒక బాధ్యతాయుతమైన ప్రక్రియ. ఈ దిశగా లిసూర్యాపేట జిల్లా పోలీసులులి రాత్రింబవళ్లు శ్రమిస్తూ, జిల్లా వ్యాప్తంగా అప్రమత్తతతో కూడిన పటిష్టమైన భద్రతా వలయాన్ని ఏర్పాటు చేశారు. “ప్రజల భద్రత – మన ప్రథమ కర్తవ్యం” అనే నినాదంతో వారు నిర్వహిస్తున్న ఈ కార్యకలాపాలు ఎంతో అభినందనీయం. జిల్లా ఎస్పీ నరసింహ ఐపిఎస్ గారి నేతృత్వం, డైనమిక్ నాయకత్వం, నిరంతర పర్యవేక్షణలో పోలీసు పోలీసు అధికారి క్రియాశీలక బాధ్యతను తీసుకున్నారు. రాత్రనక, పగలనక ప్రాణాలకు తెగించి, కుటుంబాలకు దూరంగా ఉంటూ ప్రజల కోసం విధులు నిర్వహిస్తున్న సూర్యాపేట జిల్లా పోలీసుల కృషి వెలకట్టలేనిది. పోలీసుల ఈ నిరంతర అప్రమత్తత వల్ల నేడు జిల్లాలో నేరాల రేటు తగ్గుముఖం పట్టడమే కాకుండా, ప్రజలు ప్రశాంతమైన జీవనాన్ని గడపగలుగుతున్నారు. సమాజ భద్రత కోసం పోలీసులకు ప్రజలు కూడా తోడ్పాటునందిస్తూ, ఏదైనా అనుమానాస్పద కదలికలు గమనిస్తే వెంటనే సమాచారం అందించడం బాధ్యతాయుతమైన పౌరునిగా మనందరి కర్తవ్యం.




రాత్రి వేళ పోలీస్ బృందాలు.

ప్రతిరోజూ రాత్రి జిల్లాలోని అన్ని అన్ని ముఖ్య పట్టనాలు, మండల కేంద్రాలు, గ్రామాల్లో నిరంతరంగా గస్తీ, పోలీస్ పెట్రోలింగ్ నిర్వహిస్తూ భద్రత కల్పిస్తున్నాయి. జిల్లా స్థాయి, డివిజన్ స్థాయి, సర్కిల్ స్థాయిలో నైట్ అలర్టింగ్ పోలీసు అధికారి పర్యవేక్షణలో పోలీసుపెట్రోలింగ్ బృందాలు, బ్లూ కోట్స్, పెట్రో కార్ బృందాలు పని చేస్తున్నాయి.

పటిష్టమైన నిఘా వ్యవస్థ.

నేరాలను మూలాల్లోనే తుడిచిపెట్టేందుకు జిల్లా పోలీసులు అత్యంత ఆధునిక మరియు పకడ్బందీ ప్రణాళికలను అమలు చేస్తున్నారు. జిల్లా స్థాయి నుండి మండల స్థాయి వరకు పోలీసు అధికారులు నిరంతరం పర్యవేక్షిస్తూ, క్షేత్రస్థాయిలో పెట్రోలింగ్ బృందాలను సమన్వయం చేస్తున్నారు.

ప్రాంతాల వారీగా నిఘా ఏర్పాటు:లి పట్టణాలు, మండల కేంద్రాలు, మరియు గ్రామాల్లో నిరంతర గస్తీ నిర్వహిస్తున్నారు. ముఖ్యంగా బ్యాంకులు, ఏటీఎంలు, ఆర్థిక సంస్థలు, షాపింగ్ మాల్స్, ప్రార్థనా మందిరాలు మరియు బస్టాండ్ల వంటి రద్దీ ప్రాంతాల్లో నిఘాను మరింత కఠినతరం చేశారు.

సమస్యాత్మక వ్యక్తులపై నిఘా:లి ఆకతాయిలు, అనుమానిత వ్యక్తులు మరియు గతంలో నేర చరిత్ర కలిగిన వ్యక్తుల కదలికలపై పోలీసులు నిశిత దృష్టి సారిస్తున్నారు. రాత్రి వేళల్లో నేరాలకు అవకాశం ఉన్న కాలనీలను మూడు విడతల్లో సందర్శిస్తూ, నివాసితులకు రక్షణ కల్పిస్తున్నారు.

సమర్థవంతమైన స్పందన – ‘డయల్ 100’ ఫిర్యాదులపై పోలీసు సేవలు.

ప్రజల నుండి వచ్చే ఫిర్యాదులకు సత్వరమే స్పందించడం కోసం పోలీసులు అత్యాధునిక వ్యవస్థలను వాడుతున్నారు. ఏదైనా అత్యవసర పరిస్థితి తలెత్తినప్పుడు ‘డయల్ 100’కు కాల్ చేసిన వెంటనే, రంగంలోకి దిగుతున్న లిబ్లూ కోట్స్ మరియు పెట్రో కార్ బృందాలులి కేవలం 10 నిమిషాల వ్యవధిలోనే బాధితుల వద్దకు చేరుకుని సేవలను అందిస్తున్నాయి. ఈ వేగవంతమైన స్పందన ప్రజల్లో పోలీసుల పట్ల నమ్మకాన్ని పెంచుతోంది.

నిరంతర తనిఖీలు – క్రమశిక్షణ.

చట్టవిరుద్ధమైన కార్యకలాపాలకు అడ్డుకట్ట వేయడంలో పోలీసులు కఠినంగా వ్యవహరిస్తున్నారు.

రౌడీ షీటర్లు ఒ గంజాయి నిందితులు:లి రౌడీ షీటర్లు, గంజాయి కేసుల్లో నిందితులు మరియు ఇతర సమస్యలను సృష్టించే వ్యక్తులపై ప్రత్యేక నిఘా ఉంచారు. వారు తమ నివాసాల్లోనే ఉంటున్నారా లేదా వేరే ప్రాంతాలకు సంచరిస్తున్నారా అన్న విషయాన్ని పోలీసులు నిరంతరం తనిఖీ చేస్తూ, వారిని హెచ్చరిస్తున్నారు.



అసాంఘిక కార్యకలాపాలపై ఉక్కుపాదం.

సూర్యాపేట జిల్లా పోలీసులు నేరపూరిత వాతావరణాన్ని తొలగించేందుకు కఠినమైన చర్యలు తీసుకుంటున్నారు:

– అసాంఘిక శక్తులపై నిఘా: బహిరంగంగా మద్యం సేవించడం, వ్యసనాలకు పాల్పడటం వంటి పనులపై ప్రత్యేక నిఘా ఉంచారు.

– నేరస్తుల పర్యవేక్షణ: రౌడీ షీటర్లు, గంజాయి కేసుల్లో నిందితులు మరియు ఇతర సమస్యలు సృష్టించే వ్యక్తులు తమ నివాసాల్లోనే ఉంటున్నారా లేదా అక్రమ కార్యకలాపాలకు పాల్పడుతున్నారా అని నిరంతరం తనిఖీ చేసి, హెచ్చరికలు జారీ చేస్తున్నారు.

– అక్రమ రవాణా నిరోధం: జిల్లా సరిహద్దులు మరియు ప్రధాన రహదారులపై ప్రత్యేక తనిఖీలు నిర్వహిస్తూ, గంజాయి వంటి మాదకద్రవ్యాల అక్రమ రవాణాపై ఉక్కుపాదం మోపుతున్నారు.

సూర్యాపేట జిల్లా పోలీసుల అంకితభావం, జిల్లాను నేర రహితంగా మార్చడంలో కీలకంగా మారుతోంది.

# మాటే పాటయితే..సింగీతం తరహా మూవీ

**సింగ్ గీతంతో కొత్తగా ఆలోచించిన దర్శకుడు**

94ఏండ్ల వయసులో సింగీతం శ్రీనివాసరావు దర్శకత్వం వహించిన ఫాంటసీ కామెడీ మ్యూజికల్ ఫిల్మ్ 'సింగ్ గీతం'. మాటల్లేకుండా 'పుష్పక విమానం' వంటి గొప్ప క్లాసిక్‌ని తెరకెక్కించిన సింగీతం.. 'మాటలే పాటలైతే' అని కాన్సెప్ట్‌తో ఈ సినిమా రూపొందించారని తెలియగానే, ప్రేక్షకుల్లో ఈ సినిమాపై ఆసక్తి మొదలైంది. పైగా ప్రతిష్టాత్మక వైజయంతీ మూవీస్, స్వప్న సినిమాస్ ఈ చిత్రాన్ని నిర్మించడం, సింగీతం విజన్‌కి నాగ్ అశ్విన్ మేకింగ్ తోడవ్వడంతో ఈ సినిమాపై అంచనాలు భారీగా పెరిగాయి. కథలోకి వెళితే..ప్పుడే జైలు నుంచి విడుదలైన ప్రతాప్(ఆయాన్) తన తండ్రి తన పేరు రాసిన ఆస్తిని దక్కించుకునేందుకు అగ్రిమెంట్ పేపర్లను తీసుకొని కుబేరపురం గ్రామానికి వెళ్తాడు. అదో మిస్టీరియస్ విలేజ్. అక్కడ ఓ కొండ ఉంటుంది. ఆ కొండలో కుబేరుడి గుహ కూడా ఉంటుంది. ఆ ప్రాంత జనం కుబేరుడ్ని పూజిస్తుంటారు. ఎడారిని తలపించేలా ఉన్న ఆ ఊరిలో ఒకేఒక భారీ వృక్షం ఉంటుంది. ఆ చెట్టంటే ప్రాణం ఇచ్చే గౌరీ(అహల్య)ని కలుసుకుంటాడు ప్రతాప్. ఆమె ద్వారా సెల్ఫిష్ మైనింగ్ బిజినెస్ విమెన్ రేణు(షాలిని)ని కలుస్తాడు. ఆ ప్రాంతమంతా బంగారు గని అని రేణు మాటల ద్వారా తనకు అర్థమవుతుంది. రేణు, ఆమె తండ్రి(బెనర్జీ) ఇద్దరూ కలిసి తన పేరున్న స్థలంలో కూడా మైనింగ్ జరిపి, అక్కడున్న బంగారాన్ని కూడా దోచుకోవాలని చూస్తున్నారనే విషయం ప్రతాప్‌కి తెలుస్తుంది. ఉన్నట్టుండి భాగస్తుడైన ప్రతాప్ రావడంతో, చేసేది లేక రేణు, రేణు తండ్రి తమ వ్యాపారంలో ప్రతాప్‌ని కూడా భాగస్తుడిగా చేర్చుకుంటారు. అప్పటికే ఆ ప్రాంతం అంతా మైనింగ్ జరిపేసి ఉంటుంది. ఒక్క వృక్షం ఉన్న ప్లేస్‌లో మాత్రం మైనింగ్ జరిగి ఉండదు. దాంతో అక్కడ మైనింగ్ చేద్దామని ప్రతాప్ సూచించడంతో, అహల్య వద్దని వారిస్తున్నా, ఆ భారీ వృక్షాన్ని కూలగొడతారు. దీంతో గౌరీ తీవ్ర మనస్తానికి గురవుతుంది. ఆ బాధలోనే అనుకోకుండా కుబేర గుహలోకి వెళ్తుంది. ఊహించని విధంగా ఆ ఊరి జనమందరికీ మాట కాస్తా పాటై కూర్చుంటుంది. అందరూ నిజాలు చెప్పేస్తుంటారు. మాటను పాటలా పాడుతూ అంతా విచిత్రంగా, విడ్డూరంగా ఫీలవుతుంటారు? ఆ జనానికి మళ్లీ మాట ఎలా వచ్చింది? కుబేరుడి శాపం వల్ల ఆ ప్రాంతంలో ఎలాంటి




పరిణామాలు తలెత్తాయి? అనేది మిగతా కథ. సింగీతం శ్రీనివాసరావు అంటేనే ఓ ప్రయోగశాల. మాటే పాటైతే అంటూ మరో కొత్త ప్రయోగానికి తెర లేపుతూ చేసిన ప్రయత్నమే ఈ సినిమా. ఇది అన్ని సినిమాల్లాంటి సినిమా కాదు. నాగ్ అశ్విన్ చెప్పినట్టు ఇలాంటి సినిమాను ప్రపంచం నిజంగానే చూడలేదు. అది నిజంగా వందశాతం నిజం. అసలు ఇలాంటి ఆలోచన రావడమే నిజంగా గొప్ప విషయం. ఈ విభిన్నమైన కథ ద్వారా చాలా గొప్ప విషయాలను స్పృశించారు సింగీతం. పచ్చని చెట్టు బంగారం కంటే మిన్న అనే సందేశం ఈ సినిమాతో ఆయనిచ్చారు. పర్యావరణం గొప్ప తనాన్ని తెలిపేలా ఈ సినిమా తీశారు. సింగీతం విజన్‌ని, తెరపైకి తెచ్చేందుకు నాగ్ అశ్విన్ పడిన కష్టం అణువణువునా కనిపించింది. ఈ ప్రయోగం జనానికి ఎక్కితే, ఇది కచ్చితంగా మరో గొప్ప ప్రయత్నం అవుతుందని చెప్పక తప్పదు. . ప్రయోగాత్మక చిత్రాలు ఇష్టపడే వాళ్లకు 'సింగ్ గీతం' కచ్చితంగా కొత్త అనుభూతిని ఇస్తుంది.

## పూరీ మార్క్... స్లమ్ డాగ్ టీజర్




డైరెక్టర్ పూరి జగన్నాథ్, మక్కల్ సెల్వన్ విజయ్ సేతుపతి కాంబినేషన్‌లో వస్తున్న మోస్ట్ అవేటెడ్ పాన్-ఇండియా యాక్షన్ థ్రిల్లర్ 'స్లమ్‌డాగ్ -33 టెంపుల్ రోడ్' ఇప్పటికే ప్రేక్షకుల్లో భారీ అంచనాలను పెంచేసింది. ఇటీవలే విడుదలైన ఈ సినిమా టీజర్‌కు అద్భుతమైన రెస్పాన్స్ రాగా, తాజాగా చిత్రయూనిట్ ఈ టీజర్ వెనుక ఉన్న కష్టాన్ని, షూటింగ్ ఆసక్తికర విశేషాలను చూపిస్తూ ఒక పవర్‌ఫుల్ 'టీజర్ మేకింగ్ వీడియో'ను విడుదల చేసింది. ఈ మేకింగ్ వీడియోలో దర్శకుడు పూరి జగన్నాథ్ తనదైన మార్క్ స్టైల్‌లో సీన్లను ఎంత అద్భుతంగా డిజైన్ చేశారో స్పష్టంగా కనిపిస్తోంది. ముఖ్యంగా విజయ్ సేతుపతి ఒక యాచకుడి పాత్రలో విలక్షణమైన గెటప్, విభిన్నమైన డైలాగ్ డెలివరీ, మరియు యాక్షన్ సీక్వెన్స్ కోసం పడిన శ్రమ ఈ వీడియోలో ప్రధాన హైలైట్‌గా నిలిచింది. ఈ చిత్రం సమాజంలో మనం చూసే యాచకుల వెనుక ఉండే కొన్ని నిజమైన సంఘటనలు మరియు బలమైన ఎమోషన్స్ ఆధారంగా తెరకెక్కుతోందని పూరి జగన్నాథ్ వివరించారు. ఈ చిత్రంలో బాలీవుడ్ స్టార్ నటి టబు

## జైలర్-2లో గెస్ట్ పాత్రలో హృతిక్ ?



సూపర్‌స్టార్ రజినీకాంత్ కథానాయకుడిగా నటిస్తున్న మోస్ట్ అవేటెడ్ పాన్-ఇండియా యాక్షన్ డ్రామా 'జైలర్ 2'. దర్శకుడు నెల్సన్ దిలీప్‌కుమార్ దర్శకత్వంలో ప్రస్తుతం శరవేగంగా షూటింగ్ జరుపుకుంటున్న ఈ ప్రతిష్టాత్మక ప్రాజెక్ట్‌కి సంబంధించి ఒక అప్‌డేట్ వెలుగులోకి వచ్చింది. ఈ సినిమాలో మొదట బాలీవుడ్ బాద్‌షా షారుఖ్ ఖాన్ అతిథి పాత్రలో కనిపించబోతున్నాడని గతంలో పెద్ద ఎత్తున ప్రచారం జరిగినప్పటికీ, తాజా సమాచారం ప్రకారం బాలీవుడ్ గ్రీక్ గాడ్ హృతిక్ రోషన్ ఈ సినిమాలో ఒక పవర్‌ఫుల్ అండ్ ఇంటెన్స్ కామియో రోల్ చేయబోతున్నట్లు తెలుస్తోంది. గతంలో రజినీకాంత్, హృతిక్ రోషన్ కలిసి నటించిన 'భగవాన్ దాదా' (1986) చిత్రం తర్వాత, దాదాపు 40 సంవత్సరాల అనంతరం వీరిద్దరూ కలిసి మళ్లీ ఒకే స్క్రీన్‌పై కనిపించబోతున్నారు. బాలీవుడ్ స్టార్ హీరో హృతిక్ రోషన్‌కి సంబంధించిన కొన్ని కీలకమైన సన్నివేశాలను జూన్ 22, 23 తేదీల్లో చెన్నైలో ప్రత్యేకంగా వేసిన సెట్స్‌లో భారీ ఎత్తున చిత్రీకరించనున్నట్లు ఇండస్ట్రీ టాక్. ఈ మైండ్ బ్లోయింగ్ క్రేజీ అప్‌డేట్ ఇటు సౌత్ ఇండస్ట్రీతో పాటు అటు నార్త్ ప్రేక్షకుల్లోనూ సినిమాపై ఉన్న అంచనాలను ఒక్కసారిగా స్కై హైకి తీసుకెళ్లింది. సన్ పిక్చర్స్ పతాకంపై కళానిధి మారన్ అత్యంత భారీ బ్జడెట్‌తో నిర్మిస్తున్న ఈ చిత్రంలో కన్నడ స్టార్ శివరాజ్‌కుమార్, ఎస్.జె.సూర్య, మలయాళ సూపర్ స్టార్ మోహన్‌లాల్, సీనియర్ నటి రమ్యకృష్ణ, మిర్నా మినన్, హాస్య నటుడు యోగి బాబు వంటి భారీ తారాగణం నటిస్తున్నారు. రాక్‌స్టార్ అనిరుధ్ రవిచందర్ ఈ చిత్రానికి అద్భుతమైన సంగీతాన్ని అందిస్తుండగా, ఈ ఏడాది చివర్లోనే ఈ హై-వోల్టేజ్ యాక్షన్ ఎంటర్‌టైనర్ చిత్రం ప్రపంచవ్యాప్తంగా థియేటర్లలో విడుదల కానుంది.

## నానీ మూవీలో రుక్మిణీ వసంత్



సప్త సాగరాలు దాటి', 'కాంతార 2' లాంటి విజయవంతమైన చిత్రాలతో దక్షిణాదిలోనే కాక ఉత్తరాదిలోనూ మంచి గుర్తింపు తెచ్చుకుంది నటి రుక్మిణీ వసంత్. ప్రస్తుతం ఆమె చేతుల్లో యశ్ 'టాక్సిక్', ఎన్టీఆర్ 'డ్రాగన్' లాంటి భారీ చిత్రాలున్న సంగతి తెలిసిందే. అయితే ఇప్పుడామె తెలుగులో మరో కొత్త కబురు వినిపించే అవకాశమున్నట్లు తెలుస్తోంది. కథానాయకుడు నాని సొంత నిర్మాణ సంస్థ వాల్‌పోస్టర్ సినిమా పతాకంపై నిర్మించనున్న ఓ కొత్త చిత్రం కోసం ఆమెను నాయికగా పరిశీలిస్తున్నట్లు సమాచారం. దీన్ని 'దండోరా' ఫేమ్ మురళీకాంత్ తెరకెక్కించనున్నట్లు తెలిసింది. ఇప్పటికే ఈ చిత్రానికి సంబంధించిన పూర్వ నిర్మాణ పనులు జరుగుతున్నాయని.. ప్రధాన నటుడు ఖరారు కాగానే ఈ సినిమాని అధికారికంగా ప్రకటించే అవకాశం ఉదని సమాచారం.

Printed, published and owned by Rachamallu Madhavi Printed at Kranthi Printing Press, 42/603/1/1-a, Mj Colony, Street no 5, Mjcolony, Moulali Secundrabad, and Published from h.no: 10-10-117/150, Nayi brahmana colony, Neerugonda Hanuman road, Nagaram Nizamabad (m&d) 503001, Telangana, Editor : Rachamallu Madhavi.
RNI Reg No :tel/2024/89323, Cell 6305026524, Email:janasangarshana@gmail.co